

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:119 | ఎడిటర్: మేనం శ్యామ్ | శుక్రవారం 20-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

నాడు సిద్ధాంతాల కోసం రాజకీయం..
నేడు పదవుల కోసం పాకులాట..
నాడు రాజకీయాల్లో
విలువలకు విలువ ఉండేది..
సిద్ధాంతాలకు కట్టుబాటు ఉండేది.
పార్టీ గీత దాటి మాట్లాడితేనే
నిలదీసేవారు.. పార్టీ నిర్ణయానికి
వ్యతిరేకంగా వ్యవహరిస్తే సమాధానం
చెప్పాల్సి వచ్చేది. నేడు పార్టీలు మారినా,
మాటలు మార్చినా, నాయకుల వైఖరి
మారినా ప్రశ్నించే గొంతులు
తగ్గుతున్నాయా.. నాడు ప్రజల కోసం
పదవులు.. నేడు పదవుల కోసం
రాజకీయాలన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
నాడు ప్రత్యర్థిని సిద్ధాంతాలతో
ఎదుర్కొనేవారు.. నేడు అవసరమైతే
ఆలింగనం చేసుకుంటున్నారు.
నిన్నటి శత్రువులు నేటి మిత్రులు..
నిన్నటి మిత్రులు నేటి ప్రత్యర్థులు..
అధికారం కోసం ఎన్ని మలుపులైనా
తిరుగుతున్నారు. రాజకీయాల్లో మార్పు
తప్పు కాదు.. కానీ విలువలను
తాకట్టు పెట్టి పదవుల కోసం
పాకులాడటమే ఆందోళనకరం.
నాయకులు గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే..
పదవులు శాశ్వతం కాదు.. ప్రజలు ఇచ్చిన
తీర్పు, చరిత్ర ఇచ్చే తీర్పు మాత్రం అంత
సులభంగా చెరిగిపోవు..

నడ్డి శివకృష్ణ.
ఉమ్మడి నల్గొండ బ్యూరో చీఫ్

సిద్దిపేట గడ్డపై కాంగ్రెస్ గర్జన..!



- గులాబీ కోటలో రేవంత్ రాజకీయ రణభేరి
- 'ఇకపై సిద్దిపేట కాంగ్రెస్ అడ్డా'.. సీఎం సంచలన వ్యాఖ్యలు
- కేసీఆర్, హరీశ్, కేటీఆర్ పై ఘాటు విమర్శలు
- ఫామ్ హౌస్ లు, కాళేశ్వరం, కమీషన్లపై ప్రశ్నల వర్షం
- మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు
- రూ.565 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- 2034 వరకు ఇందిరమ్మ రాజ్యమేనని ధీమా

ప్రజా వాయిస్,సిద్దిపేట: గులాబీ పార్టీకి కంచుకోటగా పేరొందిన సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ సమరభేరి మోగించారు. 'నేటి నుంచి సిద్దిపేట గడ్డ కాంగ్రెస్ అడ్డా' అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అభివృద్ధి కార్యక్రమాల వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై విమర్శనాస్త్రాలు సంధించారు. గత పదేళ్ల పాలనలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి, కుటుంబ రాజకీయాలు, సాగునీటి ప్రాజెక్టుల వ్యవహారాలను ప్రస్తావిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

గులాబీ కోటలో హస్తం జోరు

సిద్దిపేటలో కాంగ్రెస్ కార్యకర్తలు చూపిన ఉత్సాహాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల మద్దతుతో సిద్దిపేట రాజకీయ ముఖచిత్రం మారుతోందని వ్యాఖ్యానించారు. గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల్లోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రజలు కోరుకున్న నాయకుడికే ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని ప్రకటించి రాజకీయంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

మదన్ మోహన్ కు అరుదైన గౌరవం

తెలంగాణ తొలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్‌మోహన్ సేవలను సీఎం గుర్తుచేశారు. సిద్దిపేట మెడికల్ కాలేజీకి ఆయన పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే అధికారిక ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం కృషి చేసిన నాయకులను చరిత్రలో నిల పాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు.

ఫామ్ హౌస్ లపై ప్రశ్నల వర్షం

హరీశ్‌రావు కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్ పరిసరాల్లో ఫామ్‌హౌస్‌ల అంశాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ కోసం యువకులు ప్రాణత్యా గాలు చేస్తే కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబె ట్టుకున్నారని ఆరోపించారు. ఒకప్పుడు హరీశ్‌రావుకు అండగా నిలిచిన నాయకుల కుటుంబాల పరిస్థితులను కూడా ప్రస్తావిం చారు.

కాళేశ్వరం.. కమీషన్లపై కాక

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజాధనం దుర్వినియోగమైందని సీఎం ఆరోపించారు. పన్నుల రూపంలో వచ్చిన రూ.20 లక్షల కోట్లు, ప్రాజెక్టుల పేరుతో చేసిన అప్పులపై లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిపోయిందని విమర్శించారు. కృష్ణా జలాల వాటా, పోతిరె డ్డిపాడు విస్తరణ, పాలమూరు ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసిందని మండిప డ్డారు. బతుకమ్మ చీరల కొనుగోళ్లలోనూ కమీషన్లు తీసుకున్నా రని ఆరోపించారు.

అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతా

కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించిన రేవంత్‌రెడ్డి.. సభకు వస్తే నీళ్లు, భూములు, లిక్కర్ వ్యవహారాలపై నిలదీస్తానని సవాల్ విసిరారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక వ్యవహారాల్లో కేటీఆర్, సంతోష్‌రావుపై ఆరోపణలు చేశారు. సొంత చెల్లికే న్యాయం చేయని కేటీఆర్ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు.

2034 వరకు ఇందిరమ్మ రాజ్యమే.!

తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోందని సీఎం తెలిపారు. 2029 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలిచి 2034 వరకు ఇందిరమ్మ రాజ్యాన్ని కొనసాగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రూ.565 కోట్ల పనులకు శ్రీకారం

సిద్దిపేట అభివృద్ధికి రూ.565 కోట్ల విలువైన పనులకు శంకుస్థా పనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్రగా బహిరంగ సభకు చేరుకున్నారు. అభివృద్ధి హామీలు, రాజకీయ విమర్శలతో సాగిన సీఎం ప్రసంగం సిద్దిపేట రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది.

అందగత్తెల ముసుగులో ఆరితేరిన ఆడ దొంగలు.!

- అయ్యప్ప భక్తులే టార్గెట్..
- ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళల అరెస్టు
- రద్దీని ఆసరాగా చేసుకుని చోరీలకు యత్నం
- లోదుస్తుల్లో దాచిన రూ.21 వేల నగదు స్వాధీనం
- కోయంబత్తూరు, తూత్తుకుడికి చెందిన నిందితులు
- గతంలోనూ పలు ప్రాంతాల్లో చోరీ కేసులు

2 లో



సాగర్ జలాలపై ఉత్తమ్ ప్రకటనలు ఉత్తుత్తివేనా

- కేఆర్ఎంబీకి రాసిన అభ్యంతర లేఖను తేదీతో సహా బయటపెట్టాలి
- ఏడాదిగా పనులు జరుగుతుంటే ప్రభుత్వ నిఘా వ్యవస్థ ఏం చేసింది
- 120 టీఎంసీల వినియోగంపై ప్రాజెక్టుల వారీగా లెక్కలు చెప్పాలి
- 250 టీఎంసీలకు పైగా తరలిం చారని ఆరోపణ
- నీళ్లు ఎక్కడికి పోయాయి
- కాంట్రాక్టుల కోసమే రాజగోపాల్‌రెడ్డి రాజకీయాలు
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి.



ప్రజా వాయిస్,హైదరాబాద్. నాగార్జునసాగర్ జలాల తరలింపు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకం పనలు సృష్టిస్తోంది. తెలంగాణ నీటి ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిం చిందంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించే వ్యవహారంపై ముందుగానే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అభ్యంతరాలు తెలిపామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్న మాటల్లో నిజాయితీ ఉంటే ఆ లేఖను తేదీతో సహా బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. ఎప్పుడు సమాచారం అందింది? ఏ రోజున అభ్యంతరం తెలిపారు? ఎవరికి లేఖ రాశారు? దాని ప్రతిని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

ఏడాదిగా పనులు జరుగుతుంటే నిఘా వ్యవస్థ ఏం చేసింది?

నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించేం దుకు ఏపీ చేపట్టిన పనులు ఏడాదిగా కొన సాగుతున్నాయని చెబుతున్న జగదీష్‌రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వానికి, ఇంటెలిజెన్స్ విభాగా నికి, నీటిపారుదల శాఖ అధికారులకు ఈ విషయం తెలియకుండా ఎలా ఉంటుందని నిలదీశారు. ఇంతకాలం మౌనంగా ఉండి ఇప్పుడు హడావుడిగా స్పందించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడి రాజకీయ ప్రయోజనాలను కాపాడేందుకే ప్రభుత్వం ఇంతకాలం మౌనం వహించిందా అని ఆరోపిం చారు.

120 టీఎంసీల లెక్కలేవి? 250 టీఎంసీలు ఎక్కడికి వెళ్లాయి?

తెలంగాణ 120 టీఎంసీల నీటిని వినియోగించుకుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటనను జగదీష్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. నాగార్జునసాగర్, లో లెవెల్ కెనాల్, హై లెవెల్ కెనాల్, మహబూబ్‌నగర్

మిగతా 2లో

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ సెగలు

- రాజగోపాల్‌రెడ్డిపై అధిష్ఠానానికి ఫిర్యాదు
- రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యల వీడియోలు పంపిన టీపీసీసీ
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యవహారంపై హైకమాండ్ ఆరా
- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.

2 లో





రహదారులే దేశాభివృద్ధికి బాటలు

- పెట్టుబడులు రావాలంటే మెరుగైన రోడ్ కనెక్టివిటీ అవసరం
- సీఎం రేవంత్‌రెడ్డి
- రోడ్డు ప్రమాదాలపై నితిన్ గడ్కరీ ఆందోళన
- బ్లాక్‌స్పాట్లు లేకుండా చూడాలి
- ఎన్‌హెచ్-65 విస్తరణ, ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి కేంద్ర సహకారం కోరిన మంత్రి కోమటిరెడ్డి



ప్రజా వాయిస్,హైదరాబాద్మంచి రహదారులు లేకుండా ఏ దేశం కూడా అభివృద్ధి చెందదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నాణ్యమైన రహదారుల అనుసంధానంతోనే పారి శ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగు తాయని పేర్కొన్నారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.హైదరాబాద్‌లోని హెచ్ఐటీఈసీ ప్రాంగణంలో గురువారం 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పారిశ్రా మిక క్లస్టర్లను అనుసంధానించేలా పటిష్ఠమైన రహదారుల వ్యవస్థను అభివృద్ధి చేయడంపై తమ ప్రభుత్వం దృష్టి సారిం చిందన్నారు. జాతీయ ప్రయోజనాలు, మౌలిక వసతులు, ప్రజల సంక్షేమం వంటి అంశాల్లో రాజకీయాలకు తావుండ కూడదని, దేశాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. రహదారుల అను సంధానంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. మంచి రహదారులు ఉంటే భారీగా పెట్టుబ డులు వస్తాయని, మౌలిక వసతుల

మిగతా 2లో

ఆపదలో ఉన్నవారికి అండగా

- ప్రాణరక్షణే మా తొలి కర్తవ్యం!
- అగ్నిప్రమాదాలు, విపత్తుల వేళ క్షణాల్లో స్పందించేలా చర్యలు
- ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలుకు ప్రత్యేక ప్రాధాన్యం
- సిబ్బంది ఆరోగ్యానికి గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్
- తెలంగాణ అగ్నిమాపక, ఎన్‌ఎఫ్ డీజీగా వీసీ సజ్జనార్ బాధ్యతల స్వీకరణ

2 లో



తెలంగాణలో గుండాల రాజ్యం.. అవినీతి సామ్రాజ్యం ఏలుతోంది.!

- రేవంత్ పాలనపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు
- సన్నిహిత ఎమ్మెల్యేలకే నిధుల వరాలు.. మిగతావారికి మొండిచేయి
- ఎమ్మెల్యేలు ఫోన్లు చేసినా స్పందించని అధికారులు
- కేసీఆర్ హయాంలో నిధుల కొరత లేదు.. ఇప్పుడెందుకీ వివక్ష?
- అన్ని నియోజకవర్గాలకూ సమాన నిధులు కేటా యించాలి
- ఇదేనా పాలన తీరు అంటూ నిలదీత



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో పాలనపై మరోసారి రాజకీయ విమర్శలు భగ్గుమ న్నాయి. రాష్ట్రంలో గుండాల రాజ్యం, అవినీతి రాజ్యం నడుస్తోందంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీ శాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా స్పందించిన రాజాసింగ్.. ప్రస్తుత ప్రభుత్వ పాలనా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నిధుల కేటాయింపుల్లో పక్షపాతమా.?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధుల సమస్య కానీ, అధికారులతో సమన్వయ లోపం కానీ ఎప్పుడూ ఎదురుకాలేదని

మిగతా 2లో

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ సెగలు

ప్రజా వాయిస్,హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీ అధిష్ఠానం దృష్టికి చేరాయి. ఆయన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో కాంగ్రెస్‌లో రాజకీయ చర్చ మొదలైంది.రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను టీపీసీసీ నాయకత్వం అధిష్ఠానానికి పంపినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నాయకత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది.మరోవైపు రాజగోపాల్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం నిశితంగా గమనిస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్య పార్టీ అయినప్పటికీ క్రమశిక్షణ విషయంలో ఎవరికీ మినహాయింపులు ఉండవని తేల్చిచెప్పారు.గతంలో మాజీ మంత్రి కొండా సురేఖ వ్యవహారంలోనూ చర్యలకు ముందు పార్టీ అనేక అవకాశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఏ అంశంపైనైనా నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయం రావాలని, పరిస్థితులను బట్టి అధిష్ఠానం నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు.కొత్తగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన బీఎం సందీప్ రాష్ట్రానికి వచ్చిన తర్వాత పార్టీ అంతర్గత పరిణామాలు, నేతల మధ్య సమన్వయం, క్రమశిక్షణ అంశాలను పరిశీలిస్తారని తెలిపారు.ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతల మధ్య ఆధిపత్య పోరు, నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల కేటాయింపు, పార్టీ పదవుల భర్తీ వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల వ్యవహారం అధిష్ఠానం వరకు చేరడం రాష్ట్ర కాంగ్రెస్‌లో ప్రాధాన్యత సంతరించుకుంది.

అందగత్తెల ముసుగులో ఆరితేరిన ఆడ దొంగలు.!

ప్రజా వాయిస్, డెస్క్: అయ్యప్ప భక్తులే లక్ష్యంగా ఇద్దరు అంతరాష్ట్ర మహిళలు చోరీలకు యత్నిస్తూ కేరళ పోలీసులకు పట్టుబడ్డారు. శబరిమల యాత్రా సీజన్‌లో భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని నగదు, విలువైన వస్తువులను కాజేయాలని పథకం వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బస్సులో వీరి అనుమానాస్పద కదలికలను గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది.రాణి పోలీస్టేషన్ సమీపంలో బస్సును నిలిపిన పోలీసులు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మహిళా పోలీసులతో తనిఖీలు చేయించగా.. ఓ మహిళ లోదుస్తుల్లో దాచిన రూ.21 వేల నగదు బయటపడింది. నిందితులను తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన భవాని అలియాస్ పార్వతి, తూత్తుకుడికి చెందిన లక్ష్మి అలియాస్ పార్వతిగా గుర్తించారు.

రద్దీ ప్రాంతాలే అడ్డాగా..

నిందితులపై గతంలోనూ పలు ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. శబరిమల యాత్రా సీజన్‌లో ఎరుమేలి సహా ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని చోరీలకు పాల్పడేందుకు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప భక్తులకు హెచ్చరిక

యాత్ర సమయంలో రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నగదు, మొబైల్ ఫోన్లు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని హెచ్చరించారు. దర్శనానికి వెళ్లే సమయంలో తమ వస్తువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

మండీ మంట.. తొమ్మిది మందికి ఫుడ్ పాయిజన్

- ఒకే కుటుంబంలో కలకలం
- ఐదుగురు చిన్నారులు అస్వస్థత
- బిర్యానీ తిన్న కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలు
- మహిళకు న్యూరో సమస్య.. ఉస్మానియాకు బాధితుల తరలింపు*
- హోటల్ ఆహార నాణ్యతపై అనుమానాలు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎప్పుడు?

ప్రజా వాయిస్,హైదరాబాద్: బిర్యానీ తిందామనుకున్న ఆ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. ఎంతో ఇష్టంగా మండీ బిర్యానీ తిన్న తొమ్మిది మంది ఫుడ్ పాయిజనింగ్‌కు గురై ఆసుపత్రుల పాలయ్యారు. బాధితుల్లో ఐదుగురు చిన్నారులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ అంబర్‌పేటలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చి కలకలం రేపుతోంది.అంబర్‌పేటలోని గాంధీ బొమ్మ సమీపంలో ఉన్న ముక్రం బిర్యానీ హోటల్ నుంచి ఈ నెల 15న ఒకే కుటుంబానికి చెందిన వారు మండీ బిర్యానీ తెప్పించుకున్నారు. బంధువులతో కలిసి ఆహారం తీసుకున్న కొద్దిసేపటికే తొమ్మిది మందికి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో బాధితులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఘటనపై హోటల్ యజమానిని నిలదీయగా, బాధితులకు స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించినట్లు సమాచారం.

మహిళకు విషమ పరిస్థితి..

బాధితుల్లో ఓ మహిళకు న్యూరో సంబంధిత సమస్య తలెత్తడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఐదుగురు చిన్నారులు సైతం అస్వస్థతకు గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం బుధవారం బాధితులను నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు వారిని ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ఆపదలో ఉన్నవారికి అండగా

హైదరాబాద్, నవంబర్ 19 (ప్రజా వాయిస్): తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్‌గా, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీగా సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడమే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆపదలో చిక్కుకున్న వారికి సకాలంలో సహాయం అందించేందుకు స్పందన సమయాన్ని మరింత తగ్గిస్తామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అగ్నిమాపక సేవలను వేగవంతం చేస్తామని తెలిపారు.వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ నేపథ్యంలో భవనాలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో అగ్నిమాపక భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు రాష్ట్ర సచివాలయం సహా కీలక ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న ఎస్పీఎఫ్‌లో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేస్తామని పేర్కొన్నారు.సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా రెండు విభాగాల్లోని ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య వివరాలతో ప్రత్యేక నివేదికలు రూపొందిస్తామని తెలిపారు.క్రమశిక్షణ, పారదర్శకత, అంకితభావంతో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

రెండేళ్ల ప్రేమ.. పెళ్లికి నిరాకరణ!

- న్యాయం కోసం ప్రియుడి ఇంటి ఎదుట యువతి నిరాహార దీక్ష.
- ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు ముఖం చాటేశాడని ఆరోపణ.



ప్రజా వాయిస్.లింగాపూర్/ దండేపల్లి.మంచిర్యాల జిల్లా బండపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామంలోరెండేళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు ఇప్పుడు వివాహానికి నిరాకరిస్తున్నాడని ఆరోపిస్తూ ఓ యువతి న్యాయపోరాటానికి దిగింది. తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ఎదుట నిరాహార దీక్ష చేపట్టింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామానికి చెందిన ఎల్లమధ్రి అనిత (24), దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన పాల్తే గౌతమ్ (27) మధ్య రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడిందని, అది క్రమంగా ప్రేమగా మారిందని అనిత తెలిపింది. ఈ క్రమంలో ఇద్దరూ ప్రేమించుకున్నామని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన గౌతమ్ ప్రస్తుతం వివాహానికి నిరాకరిస్తున్నాడని ఆమె ఆరోపిస్తోంది. రెండేళ్ల పాటు ప్రేమ పేరుతో తనతో సంబంధం కొనసాగించి, ఇప్పుడు పెళ్లికి నిరాకరించడం వల్ల తనకు అన్యాయం జరిగిందని అనిత ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ లింగాపూర్ గ్రామంలోని గౌతమ్ ఇంటి ఎదుట నిరాహార దీక్షకు దిగింది. తన సమస్యకు న్యాయబద్ధమైన పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేసింది. తాను ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతినని, గౌతమ్ లంబాడీ సామాజిక వర్గానికి చెందిన యువకుడని అనిత పేర్కొంది. కులాలతో సంబంధం లేకుండా తనకు న్యాయం జరగాలని కోరుతోంది. సంబంధిత పోలీసు, అధికార యంత్రాంగం స్పందించి ఇరు వర్గాల వాదనలు విని సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది. రెండేళ్ల ప్రేమ వ్యవహారం పెళ్లి నిరాకరణ వరకు వెళ్లడంతో గ్రామంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. యువతి చేస్తున్న ఆందోళనపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగర్ జలాలపై ఉత్తమ్ ప్రకటనలు ఉత్తుత్తివేనా

జిల్లాలోని ఆర్డీఎస్, జూరాల, కల్వకుర్తి తదితర ప్రాజెక్టుల ద్వారా ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో స్పష్టమైన గణాంకాలతో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టుల కోసం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు!

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై జగదీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంట్రాక్టులు దక్కనప్పుడు ప్రతిపక్ష నేతలా వ్యవహరిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తారని, కాంట్రాక్టు దక్కగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడతారని ఎద్దేవా చేశారు. పాలమూరు ప్రాజెక్టు అనుమతులు, మునుగోడు నిధులు, మంత్రి పదవి వంటి వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలే ఆయన వైఖరిని ప్రభావితం చేస్తున్నాయని ఆరోపించారు. గతంలో కోల్పోయిన కాంట్రాక్టులను తిరిగి దక్కించుకోవడానికే బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నీటి హక్కులపై తేలాల్సింది ఎవరి వైఫల్యం?

సాగర్ జలాల తరలింపు వ్యవహారంలో ప్రభుత్వం చెబుతున్న ముందస్తు చర్యలు, ప్రతిపక్షం లేవనెత్తుతున్న నిర్లక్ష్య ఆరోపణల మధ్య అసలు వాస్తవాలు బయటకు రావాల్సి ఉంది. కేఆర్ఎంబీకి రాసిన లేఖ ప్రతులు, నీటి తరలింపుపై తీసుకున్న చర్యలు, ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగ లెక్కలు వెల్లడిస్తేనే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడనుంది. తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో రాజకీయ ఆరోపణలు పక్కనపెట్టి ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

రహదారులే దేశాభివృద్ధికి బాటలు

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధిలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. అదే సమయంలో దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా లక్షలాది మంది ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, మృతుల్లో యువత ఎక్కువగా ఉండటం బాధాకరమన్నారు. రహదారులపై బ్లాక్‌స్పాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీర్లదేనని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నివేదికల తయారీ నుంచి రహదారుల నిర్మాణం వరకు నాణ్యత పాటించాలని సూచించారు.

కీలక ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరిన కోమటిరెడ్డి

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణలో కీలక రహదారుల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందించాలని గడ్కరీని కోరారు. హైదరాబాద్ ప్రాంతీయ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగం పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం త్వరగా లభించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్–65ను ఆరు వరుసలుగా విస్తరించాలని కోరారు. రాష్ట్రంలోని ఇతర జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదనలను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.నవంబర్ 19 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు జరిగే ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 3,500 మంది రహదారుల రంగ నిపుణులు, ఇంజినీర్లు, అధికారులు పాల్గొంటున్నారు. ఆధునిక రహదారుల నిర్మాణం, నూతన సాంకేతికత, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.



తెలంగాణలో గుండాల రాజ్యం.. అవినీతి సామ్రాజ్యం ఏలుతోంది.!

మొదటి పేజీ తరువాయి

రాజాసింగ్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కోసం నిధులు అడిగితే లేవని చెప్పిన పరిస్థితులు లేవన్నారు.

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో నిధులు కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తనకు సన్నిహితంగా ఉండే ఎమ్మెల్యేల నియోజకవర్గాలకే నిధులు ఇస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యేల ఫోన్లకూ స్పందన కరువే

ప్రజాప్రతినిధులు అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడం లేదని రాజాసింగ్ విమర్శించారు. ఎమ్మెల్యేలకే ఈ పరిస్థితి ఎదురైతే సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారం ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలకు తావుండకూడదని, అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించాలని స్పష్టం చేశారు.

ఇదేనా పాలన తీరు రేవంత్.?

బంగారు తెలంగాణ సాధించాలంటే రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం సమానంగా అభివృద్ధి చెందాలని రాజాసింగ్ అభిప్రాయపడ్డారు. కొందరికే ప్రాధాన్యం ఇచ్చి మిగతా ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు సంధిస్తూ.. 'ఇదేనా పాలన తీరు రేవంత్ రెడ్డి? ఇది పద్ధతి కాదు' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజాసింగ్ చేసిన ఈ విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చకు తెరలేపాయి.

ప్రసంగం ఘనం.. ప్రస్తావన శూన్యం.!

- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ప్రశ్నాస్త్రాలు
- సిద్దిపేటకు నిలిచిన రూ.1,070 కోట్ల పనులపై ఎందుకు మౌనం?
- రైతు భరోసా, ఇందిరమ్మ బీమా అమలేది?
- కేసీఆర్ పథకాలు కొనసాగుతున్నాయన్న మాటల్లో వాస్తవమెంత?
- తాడిచెట్టుపై వ్యాఖ్యలతో గౌడ సామాజిక వర్గానికి అవమానం
- వ్యక్తిగత విమర్శలు మాని.. హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం

ప్రజా వాయిస్,హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో చేసిన ప్రసంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. గంటకు పైగా సాగిన ప్రసంగంలో విమర్శలు, ప్రగల్భాలు తప్ప ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. కరువు పరిస్థితులతో సతమతమవుతున్న రైతులకు భరోసా కల్పించే ప్రకటన లేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వలేదని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

పెండింగ్ పనులపై ఎందుకు మౌనం.?

సిద్దిపేటకు సంబంధించి నిలిచిపోయిన రూ.1,070 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రస్తావన సీఎం ప్రసంగంలో లేకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావించిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఏమైందని ప్రశ్నించారు. రైతు భరోసా అమలు ఎక్కడిదాకా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మైకుల ముందు గొంతు పెంచడం కంటే ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

సంక్షేమ పథకాల సంగతేంటి.?

కేసీఆర్ హయాంలో అమలైన పథకాలను తాము రద్దు చేయలేదని సీఎం చెప్పడంపై హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య లక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్, దళితబంధు, రైతుబీమా, గొర్రెలు, చేపల పంపిణీ, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు, మన ఊరు-మన బడి, కంటి వెలుగు పథకాల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ప్రజలకు గతంలో అందిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం వాస్తవాలు వెల్లడించాలని కోరారు.

గౌడన్నలకు క్షమాపణ చెప్పాలి

తాడిచెట్టు, గడ్డం ప్రస్తావనతో సీఎం వ్యక్తిగత విమర్శలకు దిగడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. తాడిచెట్టు గౌడ సామాజిక వర్గానికి జీవనాధారమైన కల్పతరువని



పేర్కొన్నారు. బలమైన వేర్లతో తుఫాన్లను సైతం తట్టుకుని నిలబడే తాడిచెట్టును తూలనాడటం గౌడన్నల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. ఈ వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి ఘనత మాదే.. ప్రచారం మీదేనా.?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అభివృద్ధి పనులకు రిబ్బన్లు కత్తిరించడం, మెడికల్ కళాశాలలకు పేర్లు పెట్టడం తప్ప ప్రస్తుత ప్రభుత్వం సాధించిన కొత్త అభివృద్ధి ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. వంట పూర్తయ్యాక గరిటె తిప్పి ఘనత తనదేనని చెప్పుకునేలా సీఎం వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

హామీలపై లెక్క చెప్పాలి

వ్యక్తిగత విమర్శలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించలేరని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతు భరోసా, సంక్షేమ పథకాలు, పెండింగ్ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాటలకంటే చేతల్లో అభివృద్ధి చూపించాలని, ప్రచారానికి కాకుండా ప్రజలకు జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎక్స్ పోస్టుల్లో స్పష్టం చేశారు.







అర్ధరాత్రి అగ్నికి 320 మోపులు ఆహుతి.!

- రైతుకు భారీ నష్టం
- దూదియాలో మంటల్లో కాలిన పశువుల మేత
- గుర్తుతెలియని వ్యక్తుల నిర్వాకమా?
- కావాలనే నిప్పు పెట్టారంటున్న బాధిత రైతు
- పశువులకు మేత కరువైందని ఆవేదన

ప్రజా వాయిస్, చిలుకూరు: అర్ధరాత్రి వేళ అగ్నికీలలు రైతు కష్టాన్ని బూడిద చేశాయి. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూదియాలో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైతు గుగులోతు రామారావుకు చెందిన 320 గడ్డిమోపులు మంటలకు ఆహుతయ్యాయి. ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల్లో గడ్డిమోపులన్నింటినీ దహించేశాయి.

నిప్పు పెట్టింది ఎవరు.?

గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టి ఉంటారని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. పశువుల మేత కోసం సమకూర్చుకున్న గడ్డిమోపులన్నీ కళ్లముందే బూడిద కావడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. ఈ ఘటనతో భారీ నష్టం వాటిల్లిందని, పశువులకు మేత సమకూర్చడం కష్టంగా మారిందని వాపోతున్నాడు. అధికారులు ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయడంతో పాటు బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అర్హుల పెన్షన్లకు మోకాలడ్డితే.. మున్సిపల్ కార్యాలయం ముట్టడే

- 3,500 దరఖాస్తుల్లో 600కు పైగా తిరస్కరణ
- అర్హులైన వారికి అన్యాయం చేస్తే సహించేది లేదు
- సోమవారం అర్హులంతా మున్సిపల్ కార్యాలయానికి రావాలి
- అధికారులను నిలదీద్దాం
- శనివారం లోగా పెన్షన్లు మంజూరుచేయకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన
- తెల్ల రేషన్ కార్డులున్న వారిని తిరస్కరించడంపై బీఆర్ ఎస్, సీపీఐ నేతల ఆగ్రహం
- అభివృద్ధి అంటే రోడ్లు కూలగొట్టడమా.. బూడిద వ్యాపారమా?
- ఎమ్మెల్యేపై విమర్శలు
- కమిషనర్ ప్రజలకు సేవ చేయాలా.. కుర్చీలో కూర్చొని సంపాదించాలా? అంటూ ప్రశ్నలు



ప్రజా వాయిస్ గోదావరిఖనిరామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన పింఛన్ దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని, తిరస్కరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్, సీపీఐ ఫ్లోర్ లీడర్లు మేకల సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. అర్హులైన వారికి శనివారం లోగా పెన్షన్లు మంజూరు చేయకపోతే లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేయూత పింఛన్ల కోసం సుమారు 3,500 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, అందులో 600కు పైగా దరఖాస్తులను తిరస్కరించారని నాయకులు తెలిపారు. తిరస్కరణకు గురైన వారిలో అర్హత కలిగిన వారు కూడా ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సోమవారం కార్యాలయానికి రండి.. ప్రశ్నిద్దాం

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని తిరస్కరణకు గురైన అర్హులైన వారంతా సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు. తమకు జరిగిన అన్యాయంపై అధికారులను ప్రశ్నించాలని కోరారు. శనివారం లోపు సమస్య పరిష్కరించకపోతే అర్హులం దరితో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్న అనేకమంది దరఖాస్తులను సైతం తిరస్కరించారని నేతలు ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వమే రేషన్ కార్డులు మంజూరు చేసిందని చెప్పుకుంటున్న నాయకులు, ఇప్పుడు అదే రేషన్ కార్డులు ఉన్నవారికి పింఛన్లు ఎందుకు నిరాకరిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల మంజూరు నిబంధనల ప్రకారమే జరిగితే, వాటిని ఆధారంగా చేసుకుని పింఛన్ల దరఖాస్తులను తిరస్కరించడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అవినీతి గురించి మాట్లాడుతున్నారని, ముందుగా తన పాలనలో జరుగుతున్న వ్యవహారాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని విమర్శించారు. ఎమ్మెల్యే వ్యవహారశైలి ఎలా ఉంటే కేడర్ కూడా అదే విధంగా వ్యవహరిస్తుందని వ్యాఖ్యానించారు. చౌరస్తాలో నిర్వహించిన సభలో కనీస వసతులు కల్పించలేకపోవడం, డివిజన్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారని నేతలు ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్యాలయం ప్రజలకు సేవలందించే కేంద్రంగా ఉండాలి తప్ప, అధికారుల వ్యక్తిగత ప్రయోజనాలకు వేదిక కాకూడదని వ్యాఖ్యానించారు. రామగుండంలో రూ.1,000 కోట్లు, రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే, అభివృద్ధి అంటే ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. రోడ్లు కూలగొట్టడం, సర్వీస్ రోడ్ల పేరుతో టోల్‌గేట్ నిర్వాహకులపై ఒత్తిడి చేయడం, బూడిద విక్రయాలు, ఓసీ గనుల కాంట్రాక్టర్లను కార్మికుల పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేయడం అభివృద్ధి కాదని ఆరోపించారు. పది అడుగుల తారు రోడ్డు, పది అడుగుల సిమెంట్ రోడ్డుతో అతుకుల బొంతలా పనులు చేస్తూ గొప్ప అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి గురించి మాట్లాడుతుంటే కాంగ్రెస్ కార్పొరేటర్లే ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు తోకల రమేష్, గుండెబోయిన భూమయ్య, యాదగిరి, శ్రీనివాస్, సీపీఐ నాయకులు శనిగరపు చంద్రశేఖర్, రాణవేణి సుధీర్ కుమార్, పోతరాజు నాగరాజు, కమలాస్ తదితరులు పాల్గొన్నారు.



నాగరంలో హైడ్రా నజర్ ... పార్కు స్థలం కబ్జాపై హైడ్రా కొరడా!

- నాగారం శ్రీనివాస్ నగర్ లో ప్రహరీ కూల్చివేత
- 1127 గజాల పార్కు స్థలం ఆక్రమణపై స్థానికుల ఫిర్యాదు
- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు

ప్రజావాయిస్, కీసర, నాగారం : కాలనీల్లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదన్న సంకేతాలను హైడ్రా అధికారులు ఇచ్చారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం శ్రీనివాస్ నగర్ కాలనీలో ఆక్రమణకు గురైన పార్కు స్థలంపై స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు.కాలనీలో సుమారు 1127 గజాల పార్కు స్థలం ఆక్రమణకు గురైందని, 2016 నుంచి స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పార్కు స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని కోరుతూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పార్కు స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. దీంతో పార్కు స్థలం ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకున్నట్లయింది. ప్రజల కోసం కేటాయించిన పార్కులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని, కాలనీల్లో మిగిలిన ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు స్థలాలను తిరిగి ప్రజల వినియోగంలోకి తీసుకువచ్చి పిల్లలు, వృద్ధులు, కాలనీవాసులకు ఆహ్లాద కరమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా స్థలాలు ప్రజలకే దక్కాలి.. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి అన్నది స్థానికుల ప్రధాన డిమాండ్‌గా మారింది....హైడ్రా కబ్జాపై స్పందించి ప్రహరీ కూల్చివేతపై శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

మూగజీవాలకు నీటి కష్టాలు

- చెరువులో చుక్క నీరు లేక అవస్థలు!
- నీటికోసం వెతుకుతున్న జీవాలను చూస్తే మనసు కలచి వేస్తుందన్న గొర్రెల కాపరులు
- తాత్కాలికంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేసి, వాటికి నిరంతరం త్రాగునీటిని అందించాలని కోరుతున్నారు

ప్రజావాయిస్, కీసర: ఎండిన చెరువు.. చుట్టూ ఎండిపోయిన గడ్డి.. తాగడానికి నీరు లేక మూగ జీవాలు పడుతున్న ఇబ్బందులు చూపరులను కలచివేస్తున్నాయి. చెరువులో నీరు లేకపోవడంతో పశువులు, గొర్రెలు, మేకలు దాహంతో అలమటిస్తూ నీటి కోసం వెతుకుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.చెరువులు, కుంటలు మూగజీవాలకు తాగునీటి ప్రధాన ఆధారం. అయితే ప్రస్తుతం చెరువుల్లో నీరు లేకపోవడంతో పశువుల కాపరులు తమ మూగజీవాలకు నీటిని అందించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండిపోయిన చెరువు ప్రాంతంలో పశువులు నీటి కోసం తిరుగుతూ కనిపిస్తున్నాయి. మూగజీవాల దాహాన్ని తీర్చేందుకు సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్పందించి తాత్కాలికంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేసి, వాటికి నిరంతరం నీటిని అందించాలని గొర్రెల కాపరులు, స్థానికులు కోరుతున్నారు. మూగజీవాల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.నీరు లేక మూగజీవాలు పడుతున్న ఈ కష్టాలను చూసైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు....





అక్రమ వెంచర్‌పై బల్దియా కొరడా..!

- బల్దియా.. టౌన్ ప్లానింగ్ అధికారి మౌనిక ఆధ్వర్యంలో కూల్చివేతలు

ప్రజావాయిస్/తాండూరు తాండూరు–కోడంగల్ ప్రధాన రహదారి మార్గంలోని సర్వే నంబర్ 4లో రాత్రికి రాత్రే వెలిసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ వెంచర్‌పై బల్దియా అధికారులు చర్యలు చేపట్టారు.టౌన్ ప్లానింగ్ అధికారి మౌనిక ఆధ్వర్యంలో బల్దియా సిబ్బంది అక్రమ వెంచర్ వద్దకు చేరుకుని హద్దురాళ్లు, రోడ్లను కూల్చివేశారు. బల్దియా సిబ్బంది చర్యలతో వెంచర్ నిర్వాహకులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.వ్యవసాయ భూమిని ఆగమేఘాల మీద వ్యవసాయేతర భూమిగా మార్చి వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ అభివృద్ధి చేస్తున్నారనే అంశంపై కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించి చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.ఇదిలా ఉండగా.. అక్రమ వెంచర్ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు 13వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ సురేష్ నాయక్ వెల్లడించారు.అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలు, వెంచర్లపై అధికారులు మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడు నెలల గర్భానికి మాత్రలెవరిచ్చారు.?

- పసికందు మృతితో వెలుగులోకి వచ్చిన వైద్య నిర్లక్ష్య ఆరోపణలు
- మూడు రోజుల మృత్యుపోరాటం.. చివరకు కన్నుమూత
- వైద్యుడెవరు?.. ఆసుపత్రి ఏది?
- మాత్రల వినియోగం తర్వాత మగ శిశువు జననం
- పొదల్లో వదిలేసిన పసికందు.. దౌర్భాగ్యం
- ఆసుపత్రి వివరాలపై వీడని గోప్యత.. వైద్య ఆరోగ్య శాఖ విచారణకు దిగేనా.?



ప్రజా వాయిస్, మంచిర్యాల:మంచిర్యాల జిల్లాలో వెలుగుచూసిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఏడు నెలల గర్భంతో ఉన్న మహిళకు అబార్షన్ మాత్రలు ఇచ్చారనే ఆరోపణలు.. ఆ తర్వాత మగ శిశువు జననం.. పుట్టిన బిడ్డను పొదల్లో వదిలేయడం.. చివరకు మూడు రోజుల చికిత్స అనంతరం ఆ పసికందు మృతిచెందడం కలకలం రేపుతోంది. అసలు ఏడు నెలల గర్భానికి మాత్రలు ఇచ్చిందెవరు. వైద్యుల సూచనలతోనే ఈ మందులు వినియోగించారా. ఏ ఆసుపత్రిలో ఈ వ్యవహారం జరిగింది. అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మాత్రలు ఇచ్చిందెవరు.?

గర్భస్రావానికి సంబంధించిన మందుల వినియోగం వైద్యుల పర్యవేక్షణలో జరగాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఏడు నెలల గర్భధారణ సమయంలో ఇలాంటి మందుల వినియోగం తీవ్ర ప్రమాదాలకు దారితీయవచ్చు. అలాంటిది మహిళకు మాత్రలు ఎవరు ఇచ్చారు. వైద్యుడు సూచించారా. ఏ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించారు. అనే వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

పొదల్లో పసికందు.. మూడు రోజుల పోరాటం

మాత్రల వినియోగం అనంతరం మగ శిశువు జన్మించగా, ఆ చిన్నారిని పొదల్లో వదిలేసినట్లు సమాచారం. శిశువు ఏడుపులు విన్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు స్పందించి పసికందును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మూడు రోజుల పాటు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో శిశువు కన్నుమూసినట్లు తెలిసింది.

ఆసుపత్రి వివరాలపై అనుమానాలు

ఈ ఘటనలో మందులు అందించిన వైద్యుడు, ఆసుపత్రి వివరాలు ఇంకా స్పష్టంగా బయటకు రాకపోవడం చర్చనీయాంశమైంది. ఆసుపత్రి పేరు బయటకు రాకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

వైద్య ఆరోగ్య శాఖ ఏం చేస్తోంది.?

పసికందును పొదల్లో వదిలేసిన ఘటనపై పోలీసుల దర్యాప్తుతో పాటు, గర్భస్రావానికి సంబంధించిన మందులు ఎవరు అందించారనే అంశంపై వైద్య ఆరోగ్య శాఖ విచారణ జరపాలి. ఆసుపత్రి రికార్డులు, వైద్యుల ప్రిస్క్రిప్షన్లు, మందుల సరఫరా వివరాలను పరిశీలించాలి. మహిళకు చికిత్స అందించిన వైద్యులు, ఆసుపత్రి పాత్రపై స్పష్టత తీసుకురావాలి. పసికందు మృతికి దారితీసిన పరిస్థితులను నిగ్గు తేల్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తలూరులో నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన లబ్ధిదారులు

ప్రజా వాయిస్,పెద్దవూర: పెద్దవూర మండలం కొత్తలూరు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ల ప్రొసీడింగ్ కాపీలను గ్రామ కార్యదర్శి సతీష్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్లు మంజూరు కావడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావులపాటి రాంబాబు, ఉపసర్పంచ్ నులక సిద్ధార్థ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొట్టే రమేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ బాలేమియా, నులక దేవేందర్ రెడ్డి, రామాలయ చైర్మన్ నులక భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు రావులపాటి మహేందర్, బైరు వెంకటేశ్వర్లు, నులక జ్యోతి, బొల్లికొండ గంగరాజు, గోలి మనిషా, సైదులు, షేక్ హబీబ్, కుంటి గొర్ల భిక్షం యాదవ్, కమతం నాగార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెండాలు మారుతున్నాయ్.. ఊరి తలరాత మారేదెప్పుడు?

- కండువా రాజకీయాలపై నిలదీస్తున్న నియోజకవర్గ ప్రజలు!
- అభివృద్ధి గాలికి.. కండువాల మార్పులకే ప్రాధాన్యత!
- ఈ 'జెండా' రాజకీయంతో లాభపడుతున్నదెవరు?
- పార్టీల మార్పుతో లాభపడేదెవరు?.. నష్టపోయేదెవరు?
- కండువా రాజకీయాలపై కన్నెర్రజేస్తున్న జనం!



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి గ్రామానికి ప్రథమ పౌరుడిగా ఉండి,ఊరి అభివృద్ధికి తోడ్పడాల్సిన సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు నేడు పార్టీల పేరు చెబుతూ జెండాలు మార్చే పనిలో నిమగ్నమయ్యారు.గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సింది పోయి,పెద్ద లీడర్ల వద్ద చేతులు చాస్తూ పూటకో పార్టీ కండువా కప్పుకోవడంపై గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కండువాల మార్పు వల్ల గ్రామాలకు కొత్తగా వస్తున్న నిధులు ఏమీ లేకపోగా,ఉన్న మౌలిక సదుపాయాల కల్పన కూడా పూర్తిగా కుంటుపడిందని జనం ఆవేదన చెందుతున్నారు.ఒకవైపు పార్టీలు మారుతూ వీడియోలలో స్పష్టంగా కనిపిస్తూనే, మరోవైపు "మేము వెళ్ళలేదు.. కండువా మార్చుకోలేదు" అంటూ నాయకులు చెబుతున్న మాటలు వారి నైతిక విలువలకు అద్దం పడుతున్నాయని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. "వీడియో తీసిన వారు పిచ్చోళ్ళా? లేక కండువాలు మార్చుకున్న వారు పిచ్చోళ్ళా?" అంటూ గ్రామాల్లో బహిరంగంగానే చర్చ జరుగుతోంది.ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆడుతున్న ఈ రాజకీయ నాటకాలను ఓటర్లు నిశితంగా గమనిస్తున్నారు.ఈ జెండాల రాజకీయంలో అత్యంత దయనీయంగా మారింది మాత్రం సామాన్య కార్యకర్తల పరిస్థితే.ఏళ్ల తరబడి ఒకే పార్టీ జెండాను మోసి, నాయకుడి కోసం లాఠీ దెబ్బలు తిని, పోలీసు కేసుల పాలైన కార్యకర్తలను నేడు పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. "మా నాయకుడు వస్తే మాకు మంచి జరుగుతుంది" అని ఆశపడిన కార్యకర్తల కుటుంబాలు నేడు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందుల్లో ఉంటే.నాయకులు మాత్రం తమ స్వప్రయోజనాల కోసం పార్టీలు మారుతూ క్యాడర్‌ను నట్టేట ముంచుతున్నారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.జెండాలు మార్చుకుంటూ వ్యక్తిగత లబ్ధి పొందే నాయకుల వల్ల నియోజకవర్గానికి ఒరిగేదేమీ లేదని ప్రజలు ఒక స్పష్టమైన నిర్ణయానికి వస్తున్నారు. క్యాడర్‌ను కాపాడుకుంటూ, ఊరి భవిష్యత్తు కోసం పాటుపడే దమ్మున్న నాయకుడే తమకు కావాలని కోరుకుంటున్నారు.హామీలను విస్మరించి, నైతిక విలువలను మర్చిపోయిన నేతలకు రాబోయే ఎన్నికల వరకు మారి ప్రజల మనసులు వారి మనలను పొంది వారి రాజకీయ భవిష్యత్తును కపడుకుంటారో లేక పాడు చేసుకుంటారు వేచి చూడాలి

అన్నదాత అంటే ప్రభుత్వానికి అంత చిన్నచూపా?

- పాపన్నపేట మండలవ్యాప్తంగా రైతన్నకు అడుగడుగునా కష్టాలు
- పట్టించుకునే నాథుడేరీ? ఇది దాదాపు 20 రోజులు గడుస్తున్నా తూక వేయని వైనం





ప్రజా వాయిస్,పాపన్నపేట. దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు నేడు అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయి. పంట పండించేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్న రైతన్నకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, అతడి సమస్యలను పట్టించుకోకపోవడం పట్ల పాపన్నపేట మండల రైతుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. రైతు సంక్షేమమే తమ లక్ష్యమని పాలకులు వేదికలపై గొప్పలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రైతుల కష్టాలు తీరడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.పాపన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగునీరు, విద్యుత్, పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర, ధాన్యం తూకాల్లో కోతలు, కొనుగోలు కేంద్రాల్లో జాప్యం వంటి సమస్యలతో సతమతమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, అధికారుల నిర్లక్ష్యం మరోవైపు అన్నదాతను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని వాపోతున్నారు.

పంట పండించడం ఒక ఎత్తయితే.. అమ్ముకోవడం మరో ఎత్తు!

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు పంటను విక్రయించే సమయంలో కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. తేమ శాతం పేరుతో ఇబ్బందులు, తూకాల్లో తరుగు, కొనుగోళ్లలో జాప్యం, గిట్టుబాటు ధర విషయంలో అనిశ్చితి రైతులను కలవరపెడుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు రైతులకు భరోసా కల్పించాల్సింది పోయి, కొన్ని చోట్ల నిరీక్షణకు కేంద్రాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాగునీరు లేక ఎండుతున్న పంటలు.. రైతన్న కళ్లలో కన్నీళ్లు!

వర్షాలపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు ప్రకృతి సహకరించక పోవడం, అవసరమైన సమయంలో సాగునీరు అందకపోవడం తీవ్ర సమస్యగా మారుతోంది. పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడితే పెట్టుబడులు ఎలా తిరిగి వస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కూడా సాగుకు ఆటంకంగా మారుతున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు.

హామీలు కాగితాలకేనా.. రైతులకు న్యాయం ఎప్పుడో?

రైతు సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందుతున్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. రైతుల సమస్యలపై అధికారులు కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతను విస్మరిస్తే అన్నం పెట్టే చేతులే ఆగిపోతాయి!

రైతు కష్టం విలువ తెలియని పాలన ఎంత అభివృద్ధి గురించి మాట్లాడినా ప్రయోజనం ఏమిటని రైతు సంఘాలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాపన్నపేట మండలంలోని రైతుల సమస్యపై జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర, పంటకు అవసరమైన నీరు, నాణ్యమైన విద్యుత్, కొనుగోళ్లలో పారదర్శకత కల్పించాలి. అన్నదాతను గౌరవించడం అంటే దేశాన్ని గౌరవించడమే. రైతు కష్టాన్ని గుర్తించని పాలనకు ప్రజలే సమాధానం చెబుతారు.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందా? పాపన్నపేట మండల రైతుల కన్నీళ్లకు పరిష్కారం చూపుతుందా? అన్నది వేచి చూడాలి.

వయసు 90..న్యాయం కోసం పోరాటం

- కబ్జా కోరల్లో 6.38 ఎకరాల వ్యవసాయ భూమి?
- న్యాయం కోసం కన్నీళ్ళతో కలెక్టరేట్ కు!
- రెవెన్యూ విచారణకు అడ్డంకులంటూ ఫిర్యాదు
- అధికారుల జోక్యం కోసం ఎదురుచూపులు..
- చౌడపూర్ మండలం మల్కాపూర్ వృద్ధురాలి కన్నీటి గాథపై



ప్రజావాయిస్ ప్రత్యేక కథనం ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:వయసు మీదపడినా న్యాయం కోసం పోరాటం ఆపని ఓ 90 ఏళ్ల వృద్ధురాలి ఆవేదన ఇది. తనకు చెందిన భూమిని కాపాడుకునేందుకు అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఆమె న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. వయోభారంతో ఇంటికే పరిమితం కావాల్సిన వయసులో భూమి కోసం కార్యాలయాల మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆవేదన కలిగిస్తోంది.వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 42/ఏ లో ఉన్న 6 ఎకరాల 38 గుంటల భూమి తనకు చెందిందని 90 ఏళ్ల గంజి హనుమమ్మ పేర్కొంటున్నారు. ఈ భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తన భూమిని కాపాడాలని కోరుతూ కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.అక్టోబర్ 30న తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విచారణ, పంచనామా నిర్వహించేందుకు వెళ్లగా కొందరు అడ్డంకులు సృష్టించారని వృద్ధురాలు ఫిర్యాదులో ఆరోపించారు. తన వయసును ఆసరాగా చేసుకొని భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల స్పందన ఏదీ?

భూమికి సంబంధించిన వివాదంపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి పంచనామా పూర్తి చేయాలని, అవసరమైతే పోలీసు రక్షణ కల్పించి తనకు న్యాయం చేయాలని ఆమె అదనపు కలెక్టర్‌ను గతంలో కోరారు. ఈ పోరాటానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ నాయకుడు కృష్ణ మహారాజ్ మద్దతుగా నిలిచారు.90 ఏళ్ల వయసులోనూ తన హక్కు కోసం పోరాడుతున్న గంజి హనుమమ్మకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. అక్రమ కబ్జా ఆరోపణలపై విచారణ ఎప్పుడు పూర్తవుతుంది? రెవెన్యూ అధికారులు పంచనామా ఎప్పుడు నిర్వహిస్తారు? పృద్ధురాలికి పోలీసు రక్షణ కల్పించి భూమిని కాపాడేందుకు చర్యలు ఎప్పుడు తీసుకుంటారు? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.కలెక్టర్ స్పందించి వృద్ధురాలి సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. 90 ఏళ్ల వృద్ధురాలి కన్నీటికి పరిష్కారం లభించే దెన్నడో.. అధికారుల చర్యలే సమాధానం చెప్పాలి.

పేద విద్యార్థికి 'విజన్ వరల్డ్' ఆపన్నహస్తం

- చామన్ పెల్లిలో రాహుల్ కు రూ. 40 వేల ఆర్థిక సాయం!
- నట్టల నివారణకు మందు పంపిణీ



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థి శ్రీ పోచమ్మల రాహుల్కు 'విజన్ వరల్డ్' స్వచ్ఛంద సంస్థ ఆపన్నహస్తం అందించింది. గతంలో కోతులు వెంబడించడంతో ప్రమాదవశాత్తు రాహుల్ కాలు విరిగింది.ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థి కావడంతో,అతని వైద్యానికి మరియు చదువుకు ఆసరాగా నిలిచేందుకు విజన్ వరల్డ్ సంస్థ ముందుకు వచ్చి గురువారం రూ. 40,000 (నలభై వేల రూపాయలు) ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేసింది.గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజన్ వరల్డ్ విజయవాడ మేనేజర్ పాల్గొని రాహుల్ కుటుంబానికి ఈ చెక్కును అందజేశారు.కష్టాల్లో ఉన్న పేద విద్యార్థులకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన విజన్ వరల్డ్ సంస్థకు రాహుల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నట్టల నివారణకు మందులు పంపిణీ

గ్రామంలో జంతు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గేదె దూడలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ లక్ష్మీ సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి (పశువుల డాక్టర్) అజయ్ కుమార్ పాల్గొని గేదె దూడలకు నట్టల మందు వేశారు.ఈ సందర్భంగా పశువుల డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. గేదె దూడల ఎదుగుదలకు, ఆరోగ్యంగా ఉండటానికి నట్టల నివారణ మందు ఎంతో అవసరమని తెలిపారు. సకాలంలో నట్టల మందు వేయించడం వల్ల దూడలు వ్యాధుల బారిన పడకుండా ఉంటాయని, తద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



ఊరి దాహం తీర్చిన బావికి దిక్కెవరు?

- ఐదేళ్లుగా మట్టిలోనే మగ్గుతున్న ఊటబావి
- ఒకప్పటి జలధార.. నేడు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం!
- పునరుద్ధరణ కోసం కేసారం గ్రామస్తుల ఎదురుచూపులు!

ప్రజావాయిస్ / మోమిన్ పేట్: ఒకప్పుడు గ్రామ ప్రజల దాహార్తిని తీర్చిన ఆ బావి నేడు మట్టిలో కలిసిపోయింది. మూడు దశాబ్దాల పాటు గ్రామానికి తాగునీటిని అందించిన ఊట బావి నేడు నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా మారింది. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని కేసారం గ్రామంలో సుమారు 30 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ పురాతన ఊట బావి ఒకప్పుడు గ్రామ ప్రజలకు ప్రధాన నీటి వనరుగా ఉండేది.అయితే ఐదేళ్ల క్రితం కురిసిన అకాల వర్షాలకు బావి కూలిపోయింది. అప్పటి పాలకులు కనీసం దాని పునరుద్ధరణపై దృష్టి సారించకపోవడంతో నేటికీ అదే దుస్థితి కొనసాగుతోంది. ఊరి దాహం తీర్చిన బావిని కాపాడలేని పాలన ఎవరి కోసం? ప్రజలకు ఉపయోగపడే నీటి వనరు కళ్లముందే కనుమరుగవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారా? అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొత్త బోర్ల ఏర్పాటుకు అనుమతుల విషయంలోనూ ఆంక్షలు ఉండటంతో అందుబాటులో ఉన్న పాత నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇప్పటికైనా ప్రస్తుత సర్పంచ్ స్పందించి పాత ఊట బావిని పునరుద్ధరించి, గ్రామానికి పూర్వ వైభవం తీసుకురావాలని కేసారం గ్రామస్తులు కోరుతున్నారు. నీటి విలువ కరువొచ్చినప్పుడే తెలుస్తుందా? బావి పూర్తిగా కనుమరుగయ్యాక మేల్కొంటే ప్రయోజనం ఏమిటి? ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బావి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజావాయిస్ ఎఫెక్ట్.. నలందానగర్‌లో అక్రమ నిర్మాణాలకు షాక్

- వరుస కథనాలతో కదిలిన టౌన్ ప్లానింగ్ యంత్రాంగం, మరో మూడు భవనాలు సీజ్
- జీ+2 అనుమతులతో అదనపు అంతస్తు, పెంట్ హౌస్ నిర్మాణాలు
- ఉల్లంఘనలపై కొరడా ఝళిపించిన అధికారులు
- అనుమతుల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని ఎసిపి శ్రీధర్ సూచన





ప్రజావాయిస్|| రాజేంద్రనగర్: అక్రమ నిర్మాణాలపై ప్రజావాయిస్ ప్రచురించిన కథనాలు అధికార యంత్రాంగంలో కదలిక తీసుకొస్తున్నాయి. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని నలందానగర్‌లో అక్రమ నిర్మాణాలపై ఈ నెల 14వ తేదీన ప్రజావాయిస్‌లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.దీనిపై స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం మరో మూడు భవనాలను సీజ్ చేశారు.జీ+2 అంతస్తుల నిర్మాణాలకు మాత్రమే అనుమతులు తీసుకుని,నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తుతో పాటు పెంట్‌హౌస్ నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఉల్లంఘనలకు పాల్పడిన మూడు భవనాలపై సీజ్ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏసీపీ శ్రీధర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ నుంచి మంజూరైన అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనుమతులకు మించి అదనపు అంతస్తులు, పెంట్‌హౌస్‌లు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అక్రమ నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే నిర్మాణదారులను ఉపేక్షించేది లేదని తెలిపారు.అక్రమ నిర్మాణాలపై కథనాలు, అధికారుల్లో కదలిక,వరుస సీజ్‌లతో నిర్మాణదారుల్లో గుబులు...

ఓవైపు హైడ్రా చెరువుల పరిరక్షణ..... మరోవైపు అప్పచెరువు కబ్జాకు యత్నం

- సర్వే నంబర్ 90లో కంచె వేసేందుకు ప్రయత్నం
- అడ్డుకున్న గగన్ పహాడ్ గ్రామస్తులు
- చెరువు భూమిపై అక్రమార్కుల కన్ను
- కబ్జా ప్రయత్నాలపై గ్రామస్తుల ఆగ్రహం





ప్రజావాయిస్|| రాజేంద్రనగర్: ఓవైపు చెరువుల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా ఆక్రమణలపై చర్యలు చేపడుతుంటే,మరోవైపు కొందరు అక్రమార్కులు చెరువు భూములనే కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోనల్ పరిధిగగన్‌పహాడ్ పరిధిలోని అప్పచెరువు భూమి విషయంలో చోటుచేసుకున్న కంచె ఏర్పాటు ప్రయత్నం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.సర్వే నంబర్ 90లోని అప్పచెరువు భూమి తమదే నంటూ కొందరు వ్యక్తులు,ఓ పరిశ్రమ యజమాని కంచె వేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని కంచె ఏర్పాటు ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్ భూమిని కబ్జా చేసేందుకే,ఈ ప్రయత్నం జరుగుతోందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..చెరువులను కాపాడేందుకు,హైడ్రా చర్యలు తీసుకుంటున్న తరుణంలో చెరువు భూములనే కబ్జా చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు.

అప్పచెరువు భూములపై రెవెన్యూ,ఇరిగేషన్, మున్సిపల్,శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. సర్వే నంబర్ 90లో సమగ్ర సర్వే నిర్వహించి చెరువు అసలు విస్తీర్ణం,ఎఫ్‌టీఎల్ హద్దులను అధికారికంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు.గ్రామ సంపద అయిన చెరువులను కబ్జాల నుంచి కాపాడేందుకు గ్రామస్తులంతా ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు.కంచె వేసే ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో శీలం తిరుపతిరెడ్డి,సూరెడ్డి వినయ్ రెడ్డి,లక్ష్మణ్,శివ, శీను,సాయికిరణ్, మంజు,తదితరులు గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు.



ఇందిరమ్మ స్ఫూర్తితో అభివృద్ధికి బాటలు

- 150 ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ
- గ్రామపంచాయతీ, మహిళా సంఘాల భవనాలు ప్రారంభం
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజా వాయిస్,మిర్యాలగూడ. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ 109వ జయంతిని పురస్కరించుకుని మిర్యాలగూడ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నూతన భవనాలను ప్రారంభించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.మిర్యాలగూడ మండలం కొత్తగూడెం, అడవిదేవులపల్లి మండలం గోన్యా తండా, దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ, మహిళా సంఘాల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే దామరచర్ల మండలంలోని తిమ్మాపురం, తూర్పు తండా ప్రాంతాల్లోనూ మహిళా సంఘాల భవనాలను ప్రారంభించి స్థానికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దామరచర్ల మండల కేంద్రంలో 150 నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ సమగ్రత, సమైక్యతతో పాటు పేద ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, మహిళా సంఘాల బలోపేతం, నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన వసతులు కల్పిస్తూ, అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఆయా గ్రామాల్లో ఇందిరా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శభాష్.. కోదాడ ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ ఫిర్యాదుకు తక్షణ స్పందన.!

- బస్టాండ్ వద్ద రోడ్డు ఆక్రమణ తొలగింపు
- ఫొటోలు పంపిన వాహనదారుడు
- క్షణాల్లో స్పందించిన ట్రాఫిక్ ఎస్ ఐ అంజిరెడ్డి
- సిబ్బందితో చేరుకుని ఆక్రమణ తొలగింపు
- పోలీసుల పనితీరుపై పట్టణవాసుల హర్షం



ప్రజా వాయిస్,కోదాడ: ప్రజా సమస్యల పరిష్కారంలో సాంకేతికతను వినియోగించుకుంటూ కోదాడ ట్రాఫిక్ పోలీసులు తక్షణ స్పందన కనబరిచారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఓ వ్యాపారి రోడ్డుకు ఆనుకుని టేబుల్ ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తుండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఓ వాహనదారుడు ఆక్రమణకు సంబంధించిన ఫొటోలను వాట్సాప్ ద్వారా ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డికి పంపించారు.ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ సిబ్బందితో కలిసి బస్టాండ్ ప్రాంతానికి చేరుకున్నారు. రహదారిపై వ్యాపారం నిర్వహిస్తున్న వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి, ఆక్రమణను తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం తొలగింది.ఫిర్యాదు అందిన వెంటనే చర్యలుసమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే పరిష్కారం లభించడంతో ఫిర్యాదు చేసిన వాహనదారుడు, స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడం ద్వారా ట్రాఫిక్ పోలీసులు తమ బాధ్యతను చాటుకున్నారు. ఎస్ఐ అంజిరెడ్డి, సిబ్బంది స్పందించిన తీరుపై పట్టణవాసులు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతం

- గేదె మృతి
- గడ్డి తినబోయి కరెంట్ షాక్ కు బలి
- రూ.1.30 లక్షల విలువైన పాడిగేదె మృత్యువాత
- నష్టపరిహారం అందించాలని రైతు విజ్ఞప్తి

ప్రజా వాయిస్,పెన్‌పహాడ్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న గడ్డి తినేందుకు వెళ్లిన పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చీదెళ్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన చిట్యాల గోపి పాడిగేదెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం పశువులను మేపుకొని ఇంటికి తీసుకొస్తుండగా మార్గ మధ్యంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు గడ్డి అల్లుకొని ఉండటాన్ని గేదె గమనించింది. దానిని తినేందుకు వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. జీవనాధారమైన పాడిగేదెను కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.





మొదలైన గుప్త నిధుల వేట?

- గత మూడు రోజులుగా పట్టణంలో రహస్యంగా జెసిపిలతో తవ్వకాలు!
- సాక్షాత్తు ఆలయం ఎదురుగా భారీగా గొంతలు చేస్తున్న వేటగాళ్లు!
- అధికారులకు తెలిసిన హెచ్చరించి వదిలేసిన వైనంపట్టణంలో భారీగా గుప్త నిధుల ప్రచారం కొనసాగుతున్నట్లు వెల్లడి!

ప్రజా వాయిస్ అన్నపరెడ్డిపల్లి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్నపరెడ్డిపల్లి పట్టణంలోని ఓ దేవాలయం ఎదురుగా గత కొన్ని రోజుల నుండి పట్టణానికి చెందిన కొందరు రహస్యంగా గుప్త నిధులు తవ్వకాలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. ఇట్టి విషయాన్ని కొందరు అధికారులు పసిగట్టి మందలిచ్చి వదిలేసినట్లు విశ్వసనీయ సమాచారం కానీ పట్టణంలో సుమారు పదిమంది మేరకు గతంలో పలుచోట్ల ఇటువంటి ఘాతకాలే చేపట్టినట్లు అంతేకాకుండా రాత్రి సమయంలో జెసిపి సహాయంతో తవ్వకాలు జరిపిస్తున్నట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు మీరే ముఖంగా తెలుపుతున్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయం నందు కొందరు పూజారులతో పూజలు నిర్వహించి అట్టు ప్రదేశంలో ఎటువంటి అలజడ లేకుండా నిర్మాణంగా ఉన్న సమయంలో ఇటువంటి తవ్వకాలు జరిపిస్తున్నారని దీనికి పట్టణంలోని కొందరు దూరపు ప్రాంతాల నుండి పూజారులు సైతం రప్పిస్తున్నారని వారికి పెట్టుబడి వ్యాపారస్తులే పెడుతున్నట్లు తెలుస్తుంది గతంలో అన్నపురెడ్డిపల్లి మండలానికి కొద్దిపాటి దూరంలోనే తవ్వకాలు జరిపిన అట్టే ప్రదేశంలో ఏదో ఒక నిధి దొరికినట్లు అటువంటి దానిని రాజమండ్రి విజయవాడ వంటి ప్రాంతాలకు తరలించి విక్రయాలు జరుపుకున్నట్లు విశ్వసనీయ సమాచారం ఇప్పటికైనా అధికారులు స్పందించి గుప్త నిధుల తవ్వకాల ముఠాపై నిఘా పెట్టాలని పసుపు కుంకుమ కొబ్బరికాయలు వంటి వాటిని వినియోగించే సమయంలో పూజారులు ఏమేమి చేస్తున్నారు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు గ్రామస్తులు సైతం తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనిపై నిఘువర్గాలు నిఘా పెట్టి ఇటువంటి వాటిని అరికట్టాలంటూ అన్నపురెడ్డిపల్లి పట్టణ వాసులు కోరుకుంటున్నారు.

చెంజర్లలో చనిపోయిన వారి ఫోర్జరీ సంతకాలతో భూమి కబ్జా

- 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వితంతు మహిళ భూమికి ఎసరు
- అక్రమ పట్టాలను రద్దు చేయాలని ఆర్ డి ఓ కు ఫిర్యాదు
- విచారణ చేయకుండా అక్రమ పట్టాకు సహకరించిన ఆర్.ఐ 1, జి.పి.ఓ
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజా వాయిస్, మానకొండూర్(నవంబర్ 19): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామంలో చనిపోయిన వ్యక్తుల పేరిట ఫోర్జరీ సంతకాలు చేసి భూమిని కబ్జా చేసిన ఈ విషయంపై బాధిత మహిళ మద్ది మాధవి కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితేచెంజర్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 568/అ/2 లో గల ఎ. 2-03 గుంటల భూమిని మాధవి మామగారైన మద్ది మల్లయ్య, బొల్ల పరమేశ్వరయ్య వద్ద నుండి సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశారు. పట్టా మార్పిడి చేయించుకోకముందే భూమిని అమ్మిన పరమేశ్వరయ్య, కొన్న మల్లయ్య ఇద్దరూ మరణించారు. దీంతో ఆ భూమి రికార్డుల్లో ఇప్పటికీ పరమేశ్వరయ్య పేరు మీదే ఉంది. ఒరిజినల్ సాదా బైనామా కాగితం మాధవి వద్దనే ఉందని, మల్లయ్య కి 5 మంది కుమారులు. అందులో 4వ కుమారుడైన మద్ది రాజు భార్య మాధవి. భర్త కూడా మరణించడంతో ఆయన వాటా 0-15 గుంటలు తనకు సంక్రమించిందని మాధవి వెల్లడించారు. గత 15 ఏళ్లుగా తానే ఆ భూమిని కాస్తు, కబ్జా కలిగి ఉన్నానని తెలిపారు.



ఫోర్జరీతో పట్టా మార్పిడి...

మద్ది లక్ష్మయ్య అనే వ్యక్తి చనిపోయిన బొల్ల పరమేశ్వరయ్య మరియు మద్ది మల్లయ్య ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా తన పేరిట రెవెన్యూ రికార్డుల్లో పట్టా మార్పిడి చేయించుకున్నారని మాధవి తన ఫిర్యాదులో ఆరోపించారు.ఆ తర్వాత 17-10-2026 న తన వారసుల పేరిట కూడా పట్టా మార్పిడి చేయించి, ఆ తర్వాత వారి పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని పేర్కొన్నారు. తన భూమిని కబ్జా చేయాలని చూస్తున్న మద్ది కుమార్ పై ఇప్పటికే 14-01-2026 న మానకొండూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైందని, వారికి రూ. 1,60,000 చెల్లించి నోటరీ ద్వారా వ్రాయించుకున్నానని మాధవి తెలిపారు.



అధికారులపై కూడా ఫిర్యాదు...

విచారణ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసిన గ్రామ పాలనాధికారి మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ పై, ఫోర్జరీకి పాల్పడిన లక్ష్మయ్య, రవి, మధు, కుమార్ లపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అక్రమ పట్టాలను రద్దు చేసి, తిరిగి యథావిధిగా బొల్ల పరమేశ్వరయ్య పేరు మీదకు మార్చి తనకు న్యాయం చేయాలని మాధవి ఆర్ డి ఓ ని కోరారు."ఒరిజినల్ సాదా బైనామా నా వద్ద ఉండగా, చనిపోయిన వారి సంతకాలతో నా భూమిని ఎలా మార్చారు.? నాకు న్యాయం చేయండి" అని బాధిత మహిళ వేడుకుంటున్నారు.



విద్యుత్ తీగలతో అగ్నిప్రమాదం..!

- క్షణాల్లో బుగ్గిపాలైన ట్రాక్టర్ .. గడ్డి లోడు
- రూ.10 లక్షల ఆస్తి నష్టం..
- తృటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రజా వాయిస్ : గుర్రంపోడు నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలు–వెంకటాపురం సమీపంలో గురువారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు పైన వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే ట్రాక్టర్‌తో పాటు గడ్డి లోడు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.మారబోయిన వెంకటయ్యకు చెందిన ట్రాక్టర్‌లో ఆయన కుమారుడు శివ గడ్డి లోడు వేసుకుని రోళ్లకల్ గ్రామానికి వెళ్తుండగా వెంకటాపురం వద్ద ఈ ఘటన జరిగింది. పైన ఉన్న విద్యుత్ తీగలు గడ్డి లోడుకు తగలడంతో నిప్పురవ్వలు ఎగసిపడి మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన శివ వెంటనే ట్రాక్టర్ నుంచి కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కళ్లముందే ట్రాక్టర్, గడ్డి కాలిపోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటమే ప్రమాదానికి కారణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్ విలీనం వద్దు.. విద్య కేంద్రీకరణ వద్దు!

మొయినాబాద్ (ప్రజావాయిస్): ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే ఉప సంహరించుకోవాలని ఏఐఎస్ఏ తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ గొటూరి చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. విద్యా సంస్కరణల పేరుతో విద్యను కేంద్రీకరించడం సరికాదన్నారు.గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు కీల కమని, విలీనం వల్ల గ్రామీణ, పేద, దళిత, గిరిజన, బహుజన విద్యార్థు లకు నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేసి, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విలీనంపై విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో విస్తృత చర్చ జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని గొటూరి చరణ్ గౌడ్ స్పష్టం చేశారు.



గొంతునొప్పితో ఆస్పత్రికి... విగతజీవిగా ఇంటికి

- టీఆర్ జీ ఆస్పత్రిలో జామ జగన్ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- న్యాయం కోసం కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు
- ప్రైవేట్ ఆస్పత్రులపై పర్యవేక్షణ గాలికి వదిలేశారా.?
- వైద్య ఆరోగ్యశాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు





ప్రజావాయిస్||రాజేంద్రనగర్: చికిత్స కోసం ఆస్పత్రి గడప తొక్కిన వ్యక్తి,ప్రాణాలతో తిరిగి వస్తాడని ఎదురుచూసిన కుటుంబానికి తీరని శోకం మిగిలింది.గొంతునొప్పితో ఆస్పత్రిలో చేరిన జామ జగన్(38)మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.వైద్యుల నిర్లక్ష్యమే తమ వ్యక్తి మృతికి కారణమంటూ కుటుంబ సభ్యులు బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి గ్రామానికి చెందిన జామ జగన్(38)గురువారం ఉదయం 6 గంటల సమయంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న టీఆర్‌జీ ఆస్పత్రిలో గొంతు నొప్పితో చికిత్స కోసం చేరాడు.అయితే చికిత్స పొందుతున్న క్రమంలో ఆయన మృతి చెందాడు. సరైన వైద్య పరీక్షలు నిర్వహించకుండా,తగిన చికిత్స అందించ కపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.జగన్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.ఆస్పత్రికి ఆరోగ్యంగా తీసుకొచ్చిన తమ వ్యక్తి విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకో వాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘట నాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జగన్ మృతికి అసలు కారణా లేంటో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ ద్వారా తేల్చాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

రాజేంద్రనగర్ పరిధిలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల వైద్య సేవలపై తరచూ ఫిర్యాదులు,ఆరోపణలు వినిపిస్తున్నా,వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ ఎంతవరకు ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆస్పత్రుల్లో వైద్యుల అర్హతలు,అత్యవసర చికిత్సా సదుపాయాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా.? ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసు కుంటున్నారు.? కేవలం కుర్చీలకే పరిమితం అవుతు న్నారా.? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.జగన్ మృతిపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్త వాలను బయటపెట్టాలి.వైద్య నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.మరో కుటుంబానికి ఇలాంటి విషాదం ఎదురుకాకుండా వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికైనా అప్రమత్తం కావాలని డిమాండ్ చెస్తున్నారు.

ప్రజా వాయిస్ కథనానికి ప్రకంపనలు?

- మాయదారి వడ్డీ వ్యాపారాల కథనంతో ఏజెన్సీలో అలజడులు!
- జామాయిల్ తోటలు సైతం వారి గుప్పెట్లోనట్లు బాధితులు ఆగ్రహం!
- గ్రామాల్లో బడా వడ్డీ వ్యాపారులు రహస్య సమావేశాలు?
- ప్రాంసర్ నోట్లు వివరాలు ఎలా తెలిసాయి అంటూ విచారణ ప్రారంభించిన వైనం?
- ఒక్కొక్కరి వద్ద వందల కొద్ది ఒప్పంద పత్రాలు ఉన్నట్లు సమాచారం!
- కొందరు అంగీకర పత్రాలను ఆంధ్రకు తరలించినట్లు వెల్లడి


ప్రజా వాయిస్
ప్రజా వాయిస్ గురువారం 19-11-2026 6
మాయదారి వడ్డీ వ్యాపారాలు!?
PROMISSORY NOTE
ప్రాంసరీ నోటు

ప్రజా వాయిస్ అశ్వారావుపేట ఏజెన్సీ ప్రాంతంలోని కొందరు వడ్డీ వ్యాపారస్తుల లో ప్రజా వాయిస్ కథనానికి ప్రకంపనలు మొదలయ్యాయని తెలుస్తుంది.మా యదారి వడ్డీ వ్యాపారాల కథనాలతో ఆయా ప్రాంతాల్లో కొందరు రహస్యంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ప్రాంసర్ నోట్లు వివరాలు ఎలా తెలిసాయి అంటూ విచారణ కొనసాగించినట్లు విశ్వసనీయ సమాచారం అంతేకాకుండా ఒక్కొక్కరి వద్ద వందల కొద్ది ఒప్పంద పత్రాలు ఇప్పటికే ఆంధ్ర సరిహద్దు ప్రాంతానికి తరలించి ఓ రహస్య స్థావరంలో భద్రపరచినట్లు విశ్వసనీయ సమాచారం అంతేకాకుండా జామాయిల్ తోటలు పామాయిల్, బీడు భూములు వంటి భూములన్నీ గిరిజన ఇతరుల చేతుల్లోనే తాకట్టు విధానంలో ఉన్నాయని వాటికి సంబంధించిన ధనమును ఎప్పుడో చెల్లించడం జరిగిందని కానీ నెలల గడుస్తున్న వడ్డీలు మాత్రం పాపాలు పెరిగినట్లు పెరిగిపోయి మరల అసలు కూడా కలిసి ఉంటుందని కొందరు మీడియా ముఖంగా తెలుపుతు న్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఓ బడా భూస్వామి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో తన వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేసుకొని తెలంగాణలోని భారీగా వ్యవ సాయానికి పెట్టుబడి రూపంలో పెడుతూ భూములు పళ్ళ తోటలు ఇళ్ల స్థలాలు వడ్డీ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఇటువంటి వాటిపై గురువారం ప్రజా వాయిస్ దినపత్రిక ఓ మంచి కథనాన్ని వెల్లడించడం జరిగిందని బాధితులు ఆనందం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా బడా భూస్వామి వద్ద వడ్డీ రేట్లు ఎలా ఉంటున్నాయో తెలియదని వ్యవసాయానికి సంబంధించి ముందుగా ఒక విధానం అనుసరించి ఎరువులు కి తదుపరి ఆర్థిక సహాయం కొరకు మరల కుటుంబ అవసరాలకు తీసుకున్న ధనాన్ని రెట్టింపుగా రాయటం అందువల్లనే ఎంత వడ్డీ ఎంత అసలు అన్నది నేటికీ తెలియని పరిస్థితిలో ఉంటుందని దయచేసి ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న వడ్డీ వ్యాపారాల ఇల్లు పై సంబంధిత శాఖ తనిఖీలు నిర్వహిస్తే అంతులేని ప్రాంసర్ నోట్లో తో పాటు ఒప్పంద పత్రాలు బయటపడే అవకాశం ఉంటుందని అలాగే కొందరు గిరిజ నులకు విముక్తి కలిగి అవకాశం ఉంటుందని గిరిజన సంఘాల నాయకులు సైతం అధికారులను కోరుతున్నారు

టేక్మాల్‌లో సైబర్ నేరగాళ్ల మోసం

- ఎస్ ఐ పేరుతో ఫోన్ చేసి రూ.20 వేలు కాజేత
- ఎస్ఐ పేరుతో మోసం చేసిన దుండగలు
- సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేసిన బాధితుడు.



ప్రజా వాయిస్ టేక్మాల్: టేక్మాల్ పోలీస్ ఎస్ఐ పేరుతో ఫోన్ చేసి ఓ వ్యక్తిని నమ్మించి రూ.20 వేల నగదును కాజేసిన సైబర్ మోసం ఘటన టేక్మాల్‌లో చోటుచేసుకుంది. టేక్మాల్‌కు చెందిన సయ్యద్ ఆరీఫ్‌ను గుర్తుతెలియని సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా సంప్రదించారు. తాము పోలీస్ శాఖకు చెందిన ఎస్ఐగా పరిచయం చేసుకుంటూ మాట్లాడటంతో బాధితుడు వారి మాటలను నమ్మినట్లు బాధితుడు తెలిపారు.ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు వివిధ కారణాలు చెబుతూ బాధితుడిని నమ్మించి రూ.20 వేలు తమ ఖాతాలో జమ చేయించుకున్నట్లు తెలిపాడు.. అనంతరం మోసపోయినట్లు గుర్తించిన సయ్యద్ ఆరీఫ్ ఆందోళనకు గురయ్యాడు.వెంటనే సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చెయ్యగా వారు కేసు నమోదు చేసి నగదు జమైన అకౌంట్ ను ఫ్రీజ్ చేశారని ఆరిఫ్ తెలిపారు.ఈ ఘటన పోలీస్ అధికారుల పేర్లు, హోదాలను ఉపయోగించుకుంటూ అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగి స్తున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము పోలీసులమని, ప్రభుత్వ అధికారులమని చెప్పి డబ్బులు అడిగితే వెంటనే నమ్మవద్దు. ఎవరైనా ఫోన్ ద్వారా డబ్బులు పంపాలని ఒత్తిడి చేస్తే ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి వివరాలు నిర్ధారించుకోవాలి. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయ కూడదు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి.పోలీసుల పేరుతో జరుగుతున్న ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, అత్యాశకు లేదా భయానికి లోనై గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు పంపవద్దని పోలీసులు సూచిస్తున్నారు.ఈ ఘటనపై ఆరిఫ్ పిర్యాదుతో టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎల్లమ్మ గుడికి విరాళం.. మాణిక్యం దాతృత్వం అపురూపం!

మొయినాబాద్(ప్రజావాయిస్): గొల్లగూడెం ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మా ణానికి రెడ్డిపల్లి సర్పంచ్ షాపురం రాజు (మాణిక్యం) రూ.50 వేల నగదు విరాళం గురువారం అందజేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణంలో తన వంతు భాగ స్వామ్యంగా ముందుకొచ్చి ఉదారంగా విరాళం అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యానికి ఆలయ నిర్మాణ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాం క్షించారు.



అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో ఈ వివక్ష ఎందుకు?

- మూడు విడతల జారీతోనే ప్రక్రియ పూర్తయినట్లా?
- అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులు ఇంకా పెండింగ్ లోనే..
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి



ప్రజా వాయిస్ పెద్దపల్లి ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టుల విషయంలోనే అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా? 2026–2028 కాలపరిమితికి సంబంధించి అక్రిడి టేషన్ కార్డుల జారీ ప్రక్రియలో కొనసాగుతున్న జాప్యం ఇప్పుడు ఈ ప్రశ్నకు తావిస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో కార్డులు జారీ చేసినప్పటికీ, అన్ని అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్న కొందరు జర్నలిస్టులకు మాత్రం ఇప్పటికీ కార్డులు అందకపోవడం చర్చనీయాంశంగా మారింది. దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ విధానం.. ధ్రువపత్రాల సమర్పణకు నిర్దేశిత నిబంధ నలు.. పరిశీలనకు అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ, దరఖాస్తుల పరిష్కారంలో మాత్రం ఎందుకీ జాప్యం? మూడు విడతల్లో కార్డులు జారీ చేసిన అధి కారులు మిగిలిన దరఖాస్తుల విషయంలో ఏ ప్రాతి పదికన నిర్ణయం తీసుకుంటున్నారు? ఏవైనా లోపాలుంటే సంబంధిత జర్నలిస్టులకు తెలియజేస్తు న్నారా? లేక దరఖాస్తులు కార్యాలయాలకే పరిమిత మవుతున్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతు న్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన అక్రిడిటేషన్ నిబం ధనలు అర్హులైన జర్నలిస్టులందరికీ సమానంగా వర్తించాల్సి ఉంటుంది. ఒకే విధమైన అర్హతలు కలిగిన వారిలో కొందరికి కార్డులు మంజూరు చేసి, మరికొందరి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచితే అందుకు కారణాలను పారదర్శకంగా వెల్లడించా ల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కార్డులు మంజూరు చేయకపోవడానికి నిర్దిష్ట కారణాలుంటే వాటిని తెలియజేయాలి. అర్హతల విషయంలో అభ్యం తరాలుంటే స్పష్టత ఇవ్వాలి. అంతేగానీ దరఖాస్తు లను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం సమంజసం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. అక్రిడిటేషన్ కార్డు అనేది కేవలం గుర్తింపు పత్రం మాత్రమే కాదు.. జర్నలిస్టుల వృత్తి నిర్వహ ణకు ఉపయోగపడే ప్రభుత్వ గుర్తింపు. కార్డులు అందని కారణంగా సంబంధిత సౌకర్యాలకు దూరమవుతున్న జర్నలిస్టులు, జిల్లా కేంద్రానికి వెళ్లి అధికారులను కలవాలన్నా ప్రయాణ ఖర్చులను భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బస్సు పాస్ సౌకర్యం అందకపోవడం ఆర్థిక భారాన్ని మరింత పెంచుతోంది. ప్రజా సమస్య లను వెలుగులోకి తీసుకురావాల్సిన జర్నలిస్టులే తమ వృత్తిపరమైన గుర్తింపు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం విచారకరం. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలిం చేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి దరఖాస్తు స్థితిగతులను సమీక్షించాలి. అర్హులైన వారికి వెంటనే కార్డులు మంజూరు చేయడంతో పాటు, తిరస్కరణకు గురైన లేదా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు గల కారణాలను సంబంధిత జర్నలి స్టులకు తెలియజేయాలి. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత పాటించి, అర్హత ఉన్న ఏ ఒక్క జర్నలిస్టుకూ అన్యాయం జరగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు,గురుకులాలు,పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి

ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసి, తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతి పత్రం అందించిన బహుజన సమాజ్ పార్టీ

ప్రజా వాయిస్.. వనపర్తి

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల వసతి గృహాలు, ప్రభుత్వ యూనివర్సిటీల హాస్టళ్లలో విద్యార్థులకు నాసిరకమైన భోజనం, పురుగులు ఉన్న అన్నం, నాణ్యతలేని ఆహారం అందిస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ ఉపాధ్యక్షుడు ప్రకాష్ అసెంబ్లీ ఇన్చార్జి ఆంజనేయులు కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీంతో విద్యార్థులు అనారోగ్యం, ఆహార విషబాధ వంటి సమస్యలకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పేద, బలహీన వర్గాల విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుతో ముడిపడిన ఈ సమస్యపై తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం స్పందించాల్సిన



అవసరం ఎంతైనా ఉంది అని వారు అన్నారు.

బహుజన్ సమాజ్ పార్టీ ప్రధానంగా డిమాండ్స్:

1.పై పేర్కొన్న అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాసంస్థల హాస్టళ్లలో తక్షణమే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.

2.ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, తాగునీరు, సరుకుల నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జిల్లా స్థాయి తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలి.

3.విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని సంబంధిత అధికారులకు తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలి.

4.నాసిరకమైన ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

5.విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించాలి.

6.ప్రతి హాస్టల్లో ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ఏర్పాటు చేసి, తనిఖీలు మరియు తీసుకున్న చర్యలపై నివేదికలను సమర్పించేలా ఆదేశించాలి.

కావున, ఈ సమస్యను అత్యవసర అంశంగా పరిగణించి, జిల్లా పరిధిలోని అన్ని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, తక్షణమే ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ బాధ్యత. వారి ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్యాన్ని చేయరాదు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, అసెంబ్లీ ఇన్చార్జి ఆంజనేయులు యాదవ్, మరియు మిద్దె రాములు, తలారి బాబు, మిద్దెకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్లో గంట్ల రాజిరెడ్డికి స్థానం

శేరిలింగంపల్లి సీనియర్ జర్నలిస్టుకు కీలక బాధ్యత.. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ప్రజావాయిస్॥శేరిలింగంపల్లి:

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే)రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శేరిలింగంపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు గంట్ల రాజిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం చందానగర్లోని పీజేఆర్ స్టేడియంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పైళ్ల విఠల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్,ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులు హాజరై రాజిరెడ్డికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం కల్పించిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు,మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్కు కృతజ్ఞతలు తెలిపారు.క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు,అక్రిడిటేషన్,హెల్త్ కార్డుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.జర్నలిస్టుల హక్కులు,సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, పలువురు సీనియర్ జర్నలిస్టులు,ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాలే కాంగ్రెస్‌కు స్ఫూర్తి...

- మంథనిలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు..

- ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

ప్రజా వాయిస్ మంథని

భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మంథని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సూచనల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణలు, పేదరిక నిర్మూలన వంటి కీలక



నిర్ణయాలతో ఇందిరా గాంధీ దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. దేశ ఐక్యత, అభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించనున్న రూ. 5 లక్షల జీవిత బీమా పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, శ్రీనుబాబు నాయకత్వంలో మంథని అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మంథని సత్యం, మంథని రాకేష్, మంథని సురేష్, అయిలి శ్రీనివాస్, పెండ్రు రమాదేవి, ఎరుకల ప్రవీణ్, అజీమ్ ఖాన్తో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

- రూ.2.20 కోట్ల నిధులు కేటాయింపు

- వికారాబాద్ జిల్లాలో 11 వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాలకు అనుమతి..

- చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:

వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురానుంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2.20 కోట్ల నిధులతో జిల్లాలో 11 వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపింది.ఈ కేంద్రాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం లేదా గరిష్టంగా రూ.20 లక్షల వరకు రాయితీ కల్పిస్తారు. రైతు డ్రోన్ల కేంద్రాలకు 50 శాతం లేదా గరిష్టంగా రూ.5 లక్షల వరకు రాయితీ



అందిస్తారు.

విభాగాల వారీగా కేటాయింపులు:

– కొడంగల్ -- 4 కేంద్రాలు, రూ.80 లక్షలు.
వికారాబాద్ -- 3 కేంద్రాలు, రూ.60 లక్షలు.
తాండూరు -- 2 కేంద్రాలు, రూ.40 లక్షలు.
పరిగి -- 2 కేంద్రాలు, రూ.40 లక్షలు.
37 రకాల వ్యవసాయ పరికరాలు
దుక్కులు దున్నే యంత్రాలు, పవర్ టిల్లర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, విత్తనాలు, ఎరువులు వేసే యంత్రాలు, కలుపు తీసే పరికరాలు, పిచికారీ యంత్రాలు, రైతు డ్రోన్లు, వరి కోత యంత్రాలు, నూర్పిడి యంత్రాలు, గడ్డి కట్టే యంత్రాలు, మల్చర్లు తదితర మొత్తం 37 రకాల పరికరాలను ఈ కేంద్రాల ద్వారా రైతులకు అద్దెకు అందించనున్నారు.

ఆన్లైన్లో దరఖాస్తులు

అర్హత కలిగిన సంఘాలు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ వెబ్ద్వారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయ యంత్రాలను వ్యక్తిగతంగా కొనుగోలు చేయడం రైతులకు ఆర్థిక భారంగా మారుతున్న నేపథ్యంలో, ఈ అద్దె కేంద్రాల ద్వారా తక్కువ ఖర్చుతో అవసరమైన సమయంలో యంత్రాలను వినియోగించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. తద్వారా రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు కేంద్రాలను నిర్వహించే సంఘాలకు ఉపాధి, ఆదాయం లభిస్తాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన సంఘాలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఇందిరమ్మ జయంతి వేడుకలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: పొడితల ప్రణవ్

ప్రజా వాయిస్,ఇల్లందకుంట(నవంబర్ 19):

దేశ ఐక్యత, సమగ్రత కోసం విశేష సేవలందించిన మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పొడితల ప్రణవ్ అన్నారు. గురువారం ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరాగాంధీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల జీవితాల్లో మార్పునకు కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు.నియోజకవర్గానికి కొత్తగా 4,336 పెన్షన్లు మంజూరయ్యాయని, సిద్ధిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. అలాగే ఇందిరమ్మ చీరల పంపిణీ, నూతనంగా మంజూరైన పెన్షన్లకు నిధుల విడుదల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రణవ్ పేర్కొన్నారు. సిద్ధిపేటలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన నారాయణపురం.!

రామాలయంలో వైభవంగా ఇరుముడి మహోత్సవం

గురుస్వాముల ఆధ్వర్యంలో 74 మంది స్వాములకు ఇరుముడి ధారణ

శరణుఘోషలు.. భక్తి గీతాలు.. ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసిన ఆలయ ప్రాంగణం

ప్రజావాయిస్, చిలుకూరు:

చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలోని రామాలయం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గురువారం అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవం భక్తిపారవశ్యం నడుమ ఘనంగా నిర్వహించారు. వీరభద్రయ్య గురుస్వామి, మహాలక్ష్మయ్య గురూజీ ఆధ్వర్యంలో 74 మంది స్వాములు ఇరుముడులు ధరించి దీక్షా నియమాలను పాటిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అయ్యప్ప స్వాములకు ఆశీర్వాదాలు అందించారు. స్వాముల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి భావాన్ని చాటుకున్నారు. భక్తి గీతాలు, స్వామివారి నామస్మరణ, ప్రసాద వితరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అయ్యప్ప శరణుఘోషల మధ్య ఇరుముడి మహోత్సవం వైభవంగా సాగింది.



బీసీ హాస్టల్ విద్యార్థి ప్రణయ్ మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్

మృతుడి తల్లికి అవుట్సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలి

అద్దె భవనాల్లోని హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

మైనర్ విద్యార్థులతో క్యాటరింగ్ పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్

(ప్రజా వాయిస్ షాద్నగర్)

షాద్నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ బీసీ హాస్టల్లో ఉంటూ ప్రథమ సంవత్సరం చదువుతున్న ప్రణయ్ అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు హాస్టల్ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ఏఐఎస్ఎఫ్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలు, హాస్టళ్లను బలోపేతం చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. షాద్నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడం, ప్రైవేట్ అద్దె భవనాల్లో నిర్వహించడం దారుణమన్నారు. విద్యార్థులు సమయానికి హాస్టళ్లకు చేరుకుంటున్నారా లేదా అనే విషయాన్ని పర్యవేక్షించేందుకు కనీసం వాచ్మెన్ కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.ప్రణయ్ మృతి నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, మృతుడి తల్లికి ప్రభుత్వ వరంగా అవుట్సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.షాద్నగర్ పరిధిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని ప్రతి హాస్టల్కు వాచ్మెన్ను నియమించాలని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత హాస్టల్ వార్డెన్పై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా 18 సంవత్సరాలు నిండని మైనర్ విద్యార్థులను నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ పనులకు తీసుకెళ్తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, చైల్డ్లైన్ 1098 మరియు సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి హాస్టళ్లలో పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి షాద్నగర్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆకాష్ నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, శ్రీహరి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.





బట్వాన్‌పల్లిలో నూతన పెన్షన్‌దారులకు పెన్షన్ పంపిణీ పత్రాలు అందజేత

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా కృషి చేస్తున్నాం: సర్పంచ్ సింగతి రాజేష్.

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో నూతనంగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు గురువారం గ్రామ సర్పంచ్ సింగతి రాజేష్ పెన్షన్ పంపిణీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సింగతి రాజేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తోందని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ఈ పెన్షన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గత కొన్ని సంవత్సరాలుగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పెన్షన్ అందక ఇబ్బందులు పడుతున్న వారికి నూతనంగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు పెన్షన్లు అందేలా ప్రత్యేక చొరవ తీసుకొని కృషి చేసిన సర్పంచ్ సింగతి రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామటేంకి హరికృష్ణ, ఉపసర్పంచ్ కొప్పుల అశోక్, వార్డు సభ్యులు జాడి అరుణ, దుర్గం సుమంతి, ధనుంజయ్, చల్లూరి వెంకటేష్, రత్నం సోమయ్య, చదువుల వెంకటరమణ, గ్రామ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



హంగూ.. ఆర్భాటం లేని నాయకుడు..

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సాదాసీదా వ్యవహారశైలి

- సెలూన్‌లో సాధారణ వ్యక్తిలా హెయిర్ కటింగ్

ప్రజా వాయిస్ మంథని

సాధారణంగా అధికారంలో ఉన్నవారు, పదవుల్లో కొనసాగేవారు తమకంటూ ప్రత్యేక హంగులు, ఆర్భాటాలు ప్రదర్శించడం చూస్తుంటాం. అందుకు భిన్నంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సాధారణ వ్యక్తిలా వ్యవహరిస్తూ గురువారం మంథని పట్టణంలోని ఓ సెలూన్‌కు వెళ్లి హెయిర్ కటింగ్ చేయించుకున్నారు. ఒకవైపు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాడుతూనే మరోవైపు సాధారణ జీవనశైలిని కొనసాగిస్తున్నారనడానికి ఈ ఘటన నిదర్శనమని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. వివిధ హోదాల్లో పనిచేసినా, తన పాత జీవనశైలిని కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా అభివర్ణిస్తున్నారు.



ఇందిరమ్మ ఆశయాలే కాంగ్రెస్‌కు స్ఫూర్తి

- తాండూరు,పెద్దేముల్ లో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

ప్రజావాయిస్/తాండూరు:

తాండూరు నియోజకవర్గంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తాండూరు పట్టణంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగు ఆధ్వర్యంలో, పెద్దేముల్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లొంక నర్సింహులు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలన వంటి నిర్ణయాలతో దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. ఆమె ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రజాక్, ఎఫ్ఎన్‌సీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ 'బ్రెయిన్ రెయిన్–2026'

విద్యార్థుల ఆలోచనలే రేపటి శాస్త్ర సాంకేతిక విప్లవానికి పునాది: ఎమ్మెల్యే గడ్డం వినోద్

ప్రజా వాయిస్ - బెల్లంపల్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ 'బ్రెయిన్ రెయిన్–2026' గురువారం ఘనంగా ముగిసింది. ఈ వేడుకలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన వివిధ వైజ్ఞానిక నమూనాలు, సాంకేతిక ఆవిష్కరణలను ఆసక్తిగా తిలకించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి,



ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. సైన్స్, గణితం, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు, ఈ జోనల్ స్థాయి సైన్స్ ప్రదర్శనలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన 59 గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. నాలుగు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేతుల మీదుగా అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్పతి రమేష్, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ కాలేశ్వరం జోన్–1 అధికారి ఏ. శారద, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి పాల్గొన్నారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసింది,

గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు 'ప్రజా ట్రస్ట్' బంగారు బాట..

కుబీర్ మండలంలోని పలు గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ!



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తోడ్పడాలనే గొప్ప సంకల్పంతో నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం'ప్రజా ట్రస్ట్' ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆల్ ఇన్ వన్ (స్టడీ మెటీరియల్) పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని వానల్పాడు (గ్రానూ), మాటేగాం, కోతులుగౌ, మహాగావ్ ప్రభుత్వ పాఠశాలలతో పాటు పర్డి (బి) గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ మరియు ఎల్‌బీఎం కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులకు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ స్వయంగా విచ్చేసి పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి మోహన్‌రావు పాటిల్ మాట్లాడుతూ.. విద్య అనేది జీవితంలో ఎవరూ దోచుకోలేని గొప్ప సంపద అని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే ఉద్దేశంతో ఈ ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు.ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో,కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని, తద్వారా తమ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు.పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రజా ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చింతల్‌బోరిలో బాధితుడికి పరామర్శ

పర్యటనలో భాగంగా చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ చింతల్‌బోరి గ్రామానికి వెళ్లి, అనారోగ్యంతో బాధపడుతున్న యోగేష్‌ను వారి నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే ప్రజా ట్రస్ట్ ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. విద్యాభివృద్ధితో పాటు సామాజిక సేవా



కార్యక్రమాలు నిర్వహిస్తున్న మోహన్‌రావు పాటిల్, ట్రస్ట్ సభ్యులను ఆయా గ్రామాల ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యా విధానంపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి

టెన్ ప్లస్ టు విధానంపై హడావుడి వద్దు..

మేధావులు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులతో చర్చించాలి: యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

టెన్ ప్లస్ టు విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా మేధావులు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులు, విద్యారంగ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ డిమాండ్ చేశారు. విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చే ముందు క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను అధ్యయనం చేయాలని సూచించారు.ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో చంద్రకాంత్ మాట్లాడుతూ.. విద్యా విధానం అనేది లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైన అంశమని పేర్కొన్నారు. ఇలాంటి విషయాల్లో హడావుడిగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అందువల్ల అన్ని వర్గాలతో విస్తృతంగా చర్చలు జరిపి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థులపై పెరుగుతున్న ఫీజుల భారం, స్కాలర్‌షిప్‌ల విడుదలలో జాప్యం, బస్‌పాస్ సమస్యలు వంటి అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ముందుగా ఈ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా సమగ్ర చర్యలు చేపట్టాలని



డిమాండ్ చేశారు.విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు స్వస్తి పలికి ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య అందరికీ సమానంగా అందేలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవసరమైన వసతులు కల్పించాలన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు రానున్న రోజుల్లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని, విద్యార్థి సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, సలహాలను విద్యా విధానంలో భాగం చేయాలని చంద్రకాంత్ డిమాండ్ చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పించాలి....

బెల్లంపల్లి, నవంబర్ 19 (ప్రజా వాయిస్):

బెల్లంపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలను అధికారులు తుంగలో తొక్కుతున్నారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించకుండా అధికారులు వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన మండిపడ్డారు.గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ టి. రమేష్‌ను కలిసి ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను అధికార పార్టీ కార్యక్రమాల మాదిరిగా నిర్వహించడం ఎంతవరకు సమంజసమని అధికారులను



ప్రశ్నించారు.ఇటీవల పట్టణంలో నిర్వహించిన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన కౌన్సిలర్లను ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం, వారి హోదాకు తగిన గౌరవం కల్పించకపోవడం సరికాదని స్పష్టం చేశారు,ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్ పత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు ప్రజలందరికీ సంబంధించినవని, వాటిని ఏదో ఒక రాజకీయ పార్టీకి చెందిన కార్యక్రమాలుగా నిర్వహించడం తగదని హితవు పలికారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులందరికీ సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు,అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రభుత్వ నిబంధనలు, ప్రొటోకాల్ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాత్రను విస్మరించకూడదని, అధికారుల వ్యవహారశైలి ప్రజల్లో తప్పుడు సంకేతాలు కలిగించేలా ఉండకూడదని పేర్కొన్నారు,ఇకనైనా బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించే అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులందరికీ తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధికారులను డిమాండ్ చేశారు.

ప్రతి కుటుంబానికి భరోసా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

పథకం అమలుపై జిల్లాలో (44) మంది ప్రత్యేక అధికారుల నియామకం

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



ప్రజా వాయిస్ మహబూబాబాద్

జిల్లాలో "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం" అమలు, కార్యక్రమం ఏర్పాట్లపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సంబంధిత అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (IKJBP)పై సంబధిత అధికారులు, ఉద్యోగులు అత్యంత కీలకంగావ్యవహరించాలన్నారు.ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులు: దరఖాస్తుల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలి. ముందుగా నింపిన (ప్రే - ఫీల్డ్) దరఖాస్తులు అందించబడవు.

దశలవారీగా శిబిరాలు

గ్రామాల్లో శిబిరాలను దశలవారీగా నిర్వహించాలి. ఎలాంటి తొందరపాటు అవసరం లేదు.

జీపీల ఎంపిక

ప్రారంభంలో రవాణా, ఇంటర్నెట్ సదుపాయాలు మెరుగ్గా ఉన్న గ్రామ పంచాయతీలలో శిబిరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

మౌలిక సదుపాయాలు:

డేటా ఎంట్రీ, అవసరమైన మౌలిక సదుపాయాల సహకారం కోసం మీ సేవా కేంద్రాల ఆపరేటర్ల సేవలను వినియోగించుకోవచ్చు.

కొత్త ఫార్మాట్

ప్రభుత్వం అందించే నూతన ఫార్మాట్ ప్రకారం వివరాలను వెబ్ అప్లికేషన్‌లో నమోదు చేయాలి.

డేటా ఎంట్రీ

ప్రస్తుతం మనకు కేటాయించిన బాధ్యత కేవలం డేటా ఎంట్రీ మాత్రమే. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి.

స్కానింగ్, రసీదులు

ప్రస్తుత దశలో పత్రాలను స్కాన్ చేయడం, రసీదులు జనరేట్ చేయడం అవసరం లేదు.

నాన్ - ఎఫ్ ఎస్ సి కార్డుదారులు

నాన్- ఎఫ్ ఎస్ సి రేషన్ కార్డుదారుల వివరాలను తదుపరి దశలో పరిగణనలోకి తీసుకుంటారు.

వెబ్ అప్లికేషన్:

కొన్ని స్వల్ప మార్పులతో వెబ్ అప్లికేషన్ ప్రారంభించేందుకు సాంకేతిక ప్రక్రియ కొనసాగుతోంది.లిమొబైల్ అప్లికేషన్:లి మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రేపటిలోగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.పై సూచనలను జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది గమనించి, తదుపరి అధికారిక ఆదేశాల మేరకు సమన్వయంతో విధులు నిర్వహించవలసిందిగా కలెక్టర్ సూచించారు.నోడల్ అధికారి 1, అడిషనల్ నోడల్ అధికారులు 3, (18) మండలాలకు జిల్లా స్థాయి అధికారులు, (23) మంది మండల, మున్సిపల్ జి పి, వార్డు కోఆర్డినేటర్స్ ను ప్రత్యేకంగా నియామకం.ప్రతి కుటుంబానికి ఒక హార్దిక భరోసా ఇవ్వడం కోసం దేశంలో ఎక్కడలేని విధంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం అందించడం కోసం అధికారులు నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు, మండలాలు, మున్సిపల్ వార్డు లలో ఏర్పాటు చేసే లొకేషన్ లలో ప్రజల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లను చేయాలని త్రాగునీరు, చేర్స్, తదితర సదుపాయాలను కల్పించాలని అన్నారు, సమయం చాలా ఉన్నందున సవివరంగా పూర్తిగా వివరాలను సేకరించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు, ప్రభుత్వం నూతన విధివిధానాల ద్వారా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించాలన్నారు, ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్ఓ నాగ లక్ష్మీ, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సిపిఓ శ్రీనివాసరావు, డిఏఓ విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్నా, పశువైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, డిపిఓ రేవంత్, జిఎం ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ రెడ్డి, డిడి ట్రైబల్ వెల్ఫేర్ దేశీ రామ్ నాయక్, మైనింగ్ ఏడి వెంకటరమణ, ఏ డి ఏ శ్రీనివాసరావు, అని విభాగాల సంబంధిత అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల నుండి ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా మంజూరైన పెన్షన్ల పత్రాలు అందజేత

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం: సర్పంచ్ సుధమల్ల వెంకటి

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ సుధమల్ల వెంకటి, ఉప సర్పంచ్ తోట రవి చేతుల మీదుగా పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. నూతనంగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధమల్ల వెంకటి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో పెన్షన్లు మంజూరు చేస్తోందన్నారు. కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెన్షన్ నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఇంకా ఎవరైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ పొందేందుకు అర్హత కలిగి ఉండి, ఇప్పటివరకు పెన్షన్ మంజూరు కాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హతకు సంబంధించిన తగిన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వారి వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తదుపరి విడతలో పెన్షన్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు.

పట్టణంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు..

కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు చేసిన కాంగ్రెస్ శ్రేణులు..



ప్రజా వాయిస్ జహీరాబాద్ :

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో భారత మాజీ ప్రధానమంత్రి, దివంగత నాయకురాలు ఇందిరా గాంధీ జయంతి వేడుకలను జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తొలుత ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆమె జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. అదేవిధంగా భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు, ప్రజల సంక్షేమం కోసం చేసిన కృషి చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు గుర్తు చేశారు. ఆమె ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవ పట్ల అంకితభావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కూడా అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు,యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



రహశీల్దార్ వారి కార్యాలయము
పాపన్నపేట మండలము, జిల్లా మెదక్

Lr.No. B/21/2026

వేలము ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా పాపన్నపేట మండలము లోని నాగ్సన్ పల్లి గ్రామ శివారులో గల సుమారు (39) క్యూబిక్ మీటర్లు అక్రమముగా తరలించిన ఇసుకను తేది 26.10.2026 రోజున గ్రామ పాలన అధికారి మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్, పాపన్నపేట గార్లు గుర్తించడం జరిగినది అట్టి ఇసుకను సీజ్ చేసి గ్రామ పాలన అధికారి సంరక్షణలో ఉంచడం జరిగినది, అట్టి సీజ్ చేసినటువంటి ఇసుకను A.D Mines & Geology, మెదక్ గారిచే 13 ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లుగా సూచించబడినది. అట్టి సూచనలతో తేది: 25.11.2026 రోజున గ్రామపంచాయితి కార్యాలయం నాగ్సన్ పల్లి దగ్గర సమయము ఉదయం 11:00 గంటలకు మండల గీర్దావార్ పాపన్నపేట గారిచే వేలం పాట నిర్వహించడం జరుగును.

కావున ఇట్టి ఇసుక వేలం పాటలో ఆసక్తికలవారు పైన తెలియపరచిన ప్రదేశము తేది: 25.11.2026 గ్రామ పంచాయతీ కార్యాలయం నాగసన్ పల్లి దగ్గర సమయం ఉదయం :11:00 గంటలకు హాజరవుటకు కోరటమైనది.

నిబంధనలు:-

1. నిర్ణయించిన ప్రకారం రూ. 10,000/- " TAHSILDAR, PAPANNAPET " గారి పేరున Demand Draft తేది: 23.11.2026 సాయంత్రం 04:00 గం.ల లోపుగా సమర్పించవలెను.
2. వేలము జరుగు వారికి వేలము ముగిసిన అనంతరము సమర్పించిన Demand Draft తిరిగి ఇవ్వబడును.
3. [illegible]

నాగ్సన్ పల్లి లో 25న ఇసుక బహిరంగ బహిరంగ వేలం...

పాపన్నపేట మండల తహసీల్దార్...

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్ పల్లి శివారులో సీజ్ చేసిన 39 క్యూబిక్ మీటర్ల (13 ట్రాక్టర్ల) ఇసుకను ఈనెల 25న బహిరంగ వేలం వేయనున్నట్లు పాపన్నపేట మండల తాసిల్దార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఏ నెల 23న సాయంత్రం నాలుగు గంటల్లోపు తాసిల్దార్ పేరున రూ. 10000 డిడి సమర్పించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పీహెచ్సీ లో ఆశా డే సమావేశం

అమలు లో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా ప్రోగ్రాం అధికారి వంశీకృష్ణ

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీపనగండ్లలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ హాజరై ఆశా కార్యకర్తలకు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా గర్భిణుల ముందస్తు నమోదు ఏ ఎన్ సి (రిజిస్ట్రేషన్) పెంపొందించడం, నిర్ణీత సమయాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, పి హెచ్ సి లో సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం, అబ్బ కార్డుల నమోదు పెంచడం, అన్ని ఆరోగ్య సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం, అమలులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అధికారి వంశీకృష్ణ డాక్టర్ రాజశేఖర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు హేమవర్ధన్, శ్వేత, కరుణాశ్రీ, భాగ్యశ్రీ, కవిత, మౌనిక, పి హెచ్ ఎన్ సునాధ, సూపర్‌వైజర్లు విజయకుమారి , హెల్త్ అసిస్టెంట్ జానీర్, ఏఎన్ ఎం లు ,ఆశా కార్యకర్తలు తదితరు పాల్గొన్నారు.

మంజీరా నదిపై చెక్‌డ్యాం నిర్మాణానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి లేఖ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాసిన ఎమ్మెల్యే

కొల్చారం, నవంబర్ 19

తుక్కాపూర్ గ్రామ రైతాంగం సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంజీరా నదిపై చెక్‌డ్యాం నిర్మించాలని గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారు.నిన్న తుక్కాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవన ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి సభా వేదికపై గ్రామ రైతుల తరపున సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు మంజీరా నదిపై చెక్‌డ్యాం నిర్మించాలని కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, ఈ రోజు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలని కోరుతూ లేఖ రాశారు.రైతుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డికి తుక్కాపూర్ గ్రామ రైతాంగం తరపున సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



VAKITI SUNITHA LAXMA REDDY
M.L.A.
037- Narsapur Assembly Constituency,
Medak District, TELANGANA.

"PRESTON IVY VILLAS"
No.23, Sy.No.14, Guttala Begumpet,
Sarojini Naidu Nagar, Jubilee Hills,
Hyderabad-500033. Cell: 9849218752
E.Mail: vakitisunithareddy3@gmail.com

Dated:18.11.2026.

To,
Sri Nalamada Uttam Kumar Reddy garu,
Hon'ble Minister for Irrigation & CAD, Food & Civil Supplies,
Government of Telangana,
Hyderabad.

Sir,

Subject: Sanction for Construction of Check Dam across Manjeera river at Tukkapur (Vi), Kulcharam (M)-Request-Reg.

@@@

With reference to the subject cited above, I would like to bring to your kind notice that, the people of Tukkapur village in Kulcharam Mandal, Narsapur Constituency, are predominantly dependent on agriculture for their livelihood.

In this regard, I request you to kindly sanction a Check Dam across the Manjeera River at Tukkapur Village to facilitate water storage, improve groundwater levels and provide assured irrigation facilities to the agricultural lands in the surrounding areas. This will greatly benefit the farming community and support their livelihoods.

Thanking you.

Yours sincerely,

(V. Sunitha Laxma Reddy)



చేయూతతో పేదలకు భరోసా..

చీదేళ్లలో ఘనంగా నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్ ఆర్డర్లు అందజేత

సర్పంచ్ వరికలు పద్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం

ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు

ప్రజా వాయిస్,పెన్‌పహాడ్:

పేదలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకంలో భాగంగా పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదేళ్ల గ్రామంలో నూతన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను గురువారం ఘనంగా పంపిణీ చేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ వరికలు పద్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ మార్కెట్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లను అందజేశారు.తొలుత నాయకులంతా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కొత్తగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నేని కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గుర్రం అమృతారెడ్డి, పరేడి లింగారెడ్డి, విలాస కవి వెంకట్‌రాజ్, వార్డు సభ్యులు గొట్టిపర్తి గోపయ్య, రాంబాబు, ఉపేందర్, వరికలు ప్రవీణ్, పరశురాములు, సంతోష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రూపాయి లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే చెప్పుదెబ్బలు తింటా

మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు సవాల్



ప్రజా వాయిస్ - బెల్లంపల్లి

బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి, భీమిని మండలాల్లో ప్రజల నుంచి తాను ఒక్క రూపాయి లంచం తీసుకున్నట్లు నిరూపించినా వారితోనే చెప్పుదెబ్బలు తింటానని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ మాధవరపు వెంకట నర్సింగరావు సవాల్ విసిరారు ,ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల మంజూరు కోసం తాను లంచాలు తీసుకుంటున్నానని, భూములు కబ్జా చేస్తున్నానని కొందరు గిట్టనివారు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితబంధు, పింఛన్ల పేరిట నాటి ప్రజాప్రతినిధులు పేదల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏ ఒక్కటైనా సాక్ష్యాధారాలతో నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని, బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వందల కోట్ల అధిపతి అని, తాను కూడా ఉన్నత కుటుంబం నుంచి వచ్చారని, పేదలను పీడించి అక్రమంగా డబ్బులు సంపాదించాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు.



భైంసాలో ఘనంగా 'ఉక్కు మహిళ' జయంతి..

ఇందిరమ్మ ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేయాలి : మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

భారతదేశ ప్రథమ మహిళా ప్రధానమంత్రి, ప్రపంచం మెచ్చిన'ఉక్కు మహిళ' స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మాజీ శాసనసభ్యుడు భోంస్లే నారాయణ్ రావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు.ఈ సందర్భంగా నారాయణ్ రావు పటేల్ మాట్లాడుతూ.దేశ సేవకై తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు.గరీబీ హఠావో నినాదంతో పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి నేటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.దేశ రక్షణ విషయంలో ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయని గుర్తుచేశారు.దేశ ఐక్యత, సమగ్రత కోసం చివరి రక్తపు బొట్టు వరకు పోరాడిన ఇందిరమ్మ ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఆమె చూపిన బాటలో నడుస్తూ, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో భైంసా పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఇందిరమ్మకు ఘన నివాళులర్పించారు



వరి తగ్గించండి.. ఆరుతడి పెంచండి.. రైతులకు వ్యవసాయ శాఖ సూచన

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 19 :

చిలుకూరు మండలంలోని జెర్రిపోతుల గూడెం, ఆచార్యుల గూడెం గ్రామ పంచాయతీలో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో రాబోయే సీజన్ లో లోటు వర్షపాతం వచ్చే అవకాశం ఉందని అన్నారు. నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. దీని వల్ల నీటిని ఆదా చేయడంతో పాటు సాగు ఖర్చులు తగ్గి, మంచి ఆదాయం వస్తుందని తెలిపారు.వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా భూమి స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి విధానం పాటించడం వల్ల నేల ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు తెగుళ్ల బెడద కూడా తగ్గుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంతోష్ రాముడు, ఉప సర్పంచ్ ఉద్దండు నారాయణ, రైతులు బొడ్డుపల్లి బిక్షం, సుదర్శన్ రెడ్డి, రామిరెడ్డి, శంకర్, మైలార్ శెట్టి భద్రమ్మ, నారాయణమ్మ, మైలార్ శెట్టి వీరయ్య, పెరబోయిన సక్కుబాయి, దుస్సా పున్నమ్మ, బొడ్డుపల్లి అక్కమ్మ, పరెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో అండగా నిలిచిన పాత మిత్రులు

అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితురాలి పిల్లలకు రూ.50 వేల ఆర్థిక సాయం

2007-08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఔదార్యం

అప్పటి ఉపాధ్యాయులూ కలసి ఆర్థిక సహకారం

బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పరామర్శ

ప్రజా వాయిస్,మునగాల:

చదువు పూర్తయి ఏళ్లు గడిచినా స్నేహబంధం కొనసాగించారు. తోటి విద్యార్థిని కష్టాల్లో ఉందని తెలిసి పూర్వ విద్యార్థులంతా స్పందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇద్దరు పిల్లలకు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 2007--08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ఇటికాల శైలజ ఇద్దరు పిల్లలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో తోటి స్నేహితులు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. అప్పటి ఉపాధ్యాయులతో కలిసి రూ.50 వేలు సేకరించారు. గురువారం శైలజ ఇంటికి వెళ్లి ఆ మొత్తాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కష్టసమయంలో స్నేహితురాలికి చేయూతనిచ్చిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను స్థానికులు అభినందించారు. ఏళ్లు గడిచినా చెక్కుచెదరని స్నేహానికి ఈ సంఘటన నిదర్శనంగా నిలిచింది.

ఇందిరమ్మ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం

పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహానేత ఇందిరాగాంధీ

అనంతగిరిలో ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు

చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజా వాయిస్,అనంతగిరి:

భారత తొలి మహిళా ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలందించి, పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఉక్కు మహిళ, భారతరత్న ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం అనంతగిరి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి



ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనను లక్ష్యంగా చేసుకుని ఇందిరాగాంధీ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. భూసంస్కరణల ద్వారా పేదలకు భూములు పంపిణీ చేయడంతో పాటు, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో దేశ వ్యవసాయ రంగ అభివృద్ధికి బాటలు వేశారని గుర్తుచేశారు. ఆమె చూపిన ప్రజాసేవా మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాగి నరేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఖాజాబీ, పాకనాటి రాఘవరెడ్డి, కిష్టాపురం సర్పంచ్ కత్రము జ్ఞానేందర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు కంటూ వేణు, హాటియ నాయక్, నకరికంటి ఎల్లయ్య, ఉపసర్పంచ్ కంటూ నాగేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్రబాబు, కరిసే రవి, బోజియా నాయక్ తదితరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయంత్రపు కోర్టుల ఏర్పాటు రద్దు చేయాలి

కొయ్యల ఏమాజి డిమాండ్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ లక్షెట్టిపేట కోర్టు కమిటీ ఎన్నిక. .

ప్రజా వాయిస్. లక్షెట్టిపేట

మంచిర్యాల జిల్లా లక్షేటిపేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో పెండింగ్ కేసుల పరిష్కారం కోసమని సాయంత్రపు కోర్టుల ఏర్పాటును రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు , సీనియర్ న్యాయవాది కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. సాయంత్రం కోర్టుల ఏర్పాటు యోచనను విరమించుకోవాలని అన్నారు. ఆ కోర్టుల్లో విశ్రాంత న్యాయమూర్తులను నియమించడం శోచనీయం అన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్, బీహార్, డిల్లీ రాష్ట్రాల్లో ప్రారంభించనున్నారని అన్నారు. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. వీటి వలన పెండింగ్ కేసుల పరిష్కారం కావనీ, పైగా కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి అని అన్నారు. ప్రస్తుతం ఉన్న కోర్టుల్లో జడ్జీలు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి కోర్టులు ఏర్పాటు చేస్తే న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. వీటి ఏర్పాటును న్యాయవాదులు అడ్డుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ రోజు లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ లో ఆలిండియా లాయర్స్ యూనియన్ కోర్టు కమిటీనీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కొయ్యల ఏమాజి, జి. కిరణ్ కుమార్, వెంకటేశ్వర చారి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ లక్షెట్టిపేట కోర్టు కమిటీ గౌరవ అధ్యక్షుడుగా నగరు రవీందర్, గౌరవ సలహాదారునిగా కిరణ్ కుమార్, అధ్యక్షులుగా టి. రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా షారుక్ రూమాన్ , ఉపాధ్యక్షులుగా వేల్పుల సత్యం, సత్యగౌడ్, సహాయ కార్యదర్శులు గా రెంక సురేందర్,



తాజుద్దీన్, కోశాధికారి గా బనావత్ సంతోష్, కమిటీ సభ్యులు గా సదాశివ్, లక్ష్మణ్, గణేష్, శివ శంకర్, సునీల్ ఎన్నికయ్యారు.

మహిళా కన్వీనర్ గా జి.పద్మ

ఆలిండియా లాయర్స్ యూనియన్ లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ మహిళా కన్వీనర్ గా జి. పద్మ, కో కన్వీనర్లు గా వినీత, సజని, కమిటీ సభ్యులు గా మౌనిక, కల్పన ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కిరణ్ కుమార్, సురేందర్, నటాష్ , వెంకటేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

హస్తం పార్టీలో అసమ్మతి సెగలు..బహిరంగ విమర్శలతో రచ్చ..

పార్టీలో ఉంటారా.. కొత్త పార్టీ పెడతారా..తేల్చుకోవాలని పున్నకైలాష్ నేత సూటి ప్రశ్న

మంత్రి పదవి రాలేదని పార్టీని, ప్రభుత్వాన్ని రోడ్డుకీడుస్తారా..

కాంట్రాక్టులు దక్కలేదని ప్రభుత్వంపై విమర్శలా..

అధిష్ఠానానికి ఆధారాలతో ఫిర్యాదు చేస్తా..

క్రమ-శిక్షణ విషయంలో ఎవరికీ మినహాయింపు లేదు..

గీత దాటితే చర్యలు తప్పవు

ప్రజా వాయిస్ బ్యూరో. ఉమ్మడి నల్గొండ.

ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వంపై, పార్టీ నాయకత్వంపై చేస్తున్న వ్యాఖ్యలు అధికార పార్టీలో రాజకీయ వేడిని పెంచుతున్నాయి. తాజాగా నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత చేసిన ఘాటు వ్యాఖ్యలు ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. యాదవ సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి తీరుపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. పార్టీలో కొనసాగుతారా.. కొత్త పార్టీ పెట్టుకుంటారా.. తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు.పార్టీలో ఉంటూ ప్రభుత్వాన్ని, పార్టీ నాయకత్వాన్ని బహిరంగంగా విమర్శించడం ఎంతవరకు సమంజసమని కైలాష్ నేత నిలదీశారు. మంత్రి పదవి రాలేదనే అసంతృప్తితో పార్టీని, ప్రభుత్వాన్ని రోడ్డుకీడుస్తారా.. కాంట్రాక్టులు దక్కలేదని ప్రభుత్వంపై కత్తి కడతారా.. అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉంటూ అదే పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పార్టీలో కొనసాగడం ఇష్టం లేకుంటే బయటకు వెళ్లి కొత్త పార్టీ పెట్టుకోవాలని, దమ్ముంటే తమ నాయకత్వంలోనే రాజకీయాలు నడుపుకోవాలని సవాల్ విసిరారు.

అసంతృప్తికి ఆజ్యం పోస్తున్న వ్యాఖ్యలు

రాజగోపాల్‌రెడ్డి గత కొంతకాలంగా చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్



పార్టీలో చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం, ప్రభుత్వ పనితీరుపై ఆయన వ్యక్తం చేస్తున్న అసంతృప్తి పార్టీకి ఇబ్బందికరంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీలో నాయకుల మధ్య సమన్వయం అవసరమైన తరుణంలో బహిరంగ విమర్శలు చోటుచేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు మునుగోడు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు, నాయకులకు ప్రాధాన్యత కల్పించే అంశాలపైనా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీని నమ్ముకున్న పాత కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కడం లేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

అధిష్ఠానానికి ఫిర్యాదు అస్త్రం

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏఐసీసీకి ఫిర్యాదు చేస్తానని పున్న కైలాష్ నేత స్పష్టం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలన్నింటినీ పార్టీ అధిష్ఠానానికి అందజేస్తానని వెల్లడించారు. ఇదిలా ఉండగా, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల వ్యవహారం ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం దృష్టికి చేరినట్లు వార్తలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వివరాలు, దృశ్యాలను అధిష్ఠానానికి పంపినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో జిల్లా స్థాయిలో మొదలైన వివాదం రాష్ట్ర పార్టీ నాయకత్వం దృష్టిని ఆకర్షించింది.

క్రమశిక్షణపై అధిష్ఠానం ఏం చేయబోతోంది

క్రమశిక్షణ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని, రాజగోపాల్‌రెడ్డి అయినా.. తానైనా పార్టీ నిబంధనలకు కట్టుబడి



ఉండాల్సిందేనని పున్న కైలాష్ నేత స్పష్టం చేశారు. పార్టీ సహనానికి కూడా హద్దు ఉంటుందని, గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అసంతృప్తి నేతలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తుందా.. లేక క్రమశిక్షణ చర్యలకు సిద్ధమవుతుందా.. అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కేడర్‌లో కలవరం.. నాయకత్వంలో ఉత్కంఠ

ఒకవైపు ఎమ్మెల్యే స్థాయి నాయకుడు ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, మరోవైపు జిల్లా పార్టీ అధ్యక్షుడు బహిరంగంగా హెచ్చరికలు జారీ చేయడం కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితికి అద్దం పడుతోంది. నాయకుల మధ్య విభేదాలు బహిర్గతం కావడంతో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లోనూ చర్చ మొదలైంది. ఈ వివాదం వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతుందా.. లేక పార్టీ అంతర్గత రాజకీయాల్లో మరిన్ని పరిణామాలకు దారితీస్తుందా.. అన్నది వేచి చూడాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌లో మొదలైన ఈ అసమ్మతి సెగలు రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మలుపు తీసుకుంటాయో చూడాలి.

కలంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

విధి నిర్వహణలోని విలేకరిపై దాడి హేయమైన చర్య

నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి

నవభూమి విలేకరి నరసింహారెడ్డికి టీడబ్ల్యూజేఎఫ్ నాయకుల పరామర్శ

జిన్నారం ప్రజావాయిస్

ప్రజల పక్షాన నిలబడి, నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సాక్షాత్తూ ప్రజాస్వామ్య గొంతు నొక్కడమేనని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జిన్నారం మండలం బొల్లారం జీహెచ్ఎంసీ పరిధిలో మంగళవారం విధి నిర్వహణలో ఉన్న 'నవభూమి' విలేకరి నరసింహారెడ్డిపై కొందరు దుండగులు దాడికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు బుధవారం బాధిత జర్నలిస్టు నరసింహారెడ్డిని పరామర్శించి, ఆయనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు బాధిని శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం, జిల్లా కార్యదర్శి సీలంకోటి సురేందర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న జర్నలిస్టులపై భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని వారు పేర్కొన్నారు.వార్తల సేకరణలో భాగంగా నిత్యం సవాళ్లను ఎదుర్కొనే మీడియా ప్రతినిధులకు తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు పోలీసు యంత్రాంగంపై ఉందని నాయకులు గుర్తుచేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకుండా, బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బాధిత జర్నలిస్టుకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, జర్నలిస్టుల హక్కులు, భద్రత కోసం తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.



సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా?

కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల గడిబురుజుల స్థలాన్ని వివాదాస్పదం చేసి డబ్బులు దండుకునే కుట్ర

పూటకో మాటతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం

మాపై ఒక్క అవినీతి ఆరోపణ నిరూపించినా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాం

ప్రజా వాయిస్, కోరుట్ల:

కోరుట్ల పట్టణంలోని పురాతన గడిబురుజుల స్థలాన్ని వివాదాస్పదం చేసి, దాని ద్వారా డబ్బులు దండుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ చూస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. గురువారం కోరుట్ల పట్టణంలోని తన స్వగృహం 'జువ్వాడి భవన్'లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడి ప్రాంతాన్ని కాపాడుతానంటూ బహిరంగ ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే సంజయ్ తన ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కృష్ణారావు విమర్శించారు. "ఒకరోజు 300 అడుగుల దూరంలో నిర్మాణాలు చేయవచ్చని, మరోరోజు 15 అడుగుల దూరంలో నిర్మాణాలకు అనుమతి కోసం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి విజ్ఞప్తి చేశానని చెబుతున్నారు. ఇలా పూటకో మాట, రోజుకో స్టేట్‌మెంట్ ఇస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేసి, ఆ మాటున అవినీతితో డబ్బులు సంపాదించాలని చూస్తున్నారు" అని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గానీ, ఆయన కుమారుడు ఎమ్మెల్యే సంజయ్ గానీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని కృష్ణారావు అన్నారు. ఎన్నికల సమయంలో కొండ్రికర్ల వంతెన నిర్మిస్తానని బాండ్ కాగితం రాసిచ్చి ప్రజలను మోసం చేసిన చరిత్ర మీదని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొండ్రికర్ల వంతెన నిర్మాణాన్ని ప్రారంభించామని, త్వరలోనే అది పూర్తవుతుందని స్పష్టం చేశారు. "గడిబురుజుల స్థలం, వీఎల్‌టీ విషయంలో జరుగుతున్న అవినీతిపై కోరుట్ల పట్టణంలో ఎక్కడైనా బహిరంగ చర్చకు మేము సిద్ధం. సమయం, తేదీ మీరే నిర్ణయించండి. పట్టణ ప్రజలు, అధికారుల సమక్షంలో చర్చిద్దాం. మాపై ఏ ఒక్క అవినీతి ఆరోపణ నిరూపించినా



రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాం" అని కృష్ణారావు సవాల్ విసిరారు. దొంగతనం చేసి ఎదుటివారిని 'దొంగ.. దొంగ' అని అరిచినట్లుగా తండ్రీకొడుకుల వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. ఇతరులపై బురద చల్లడం మానుకుని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, పుప్పాల ప్రభాకర్, నాయకులు ఎంబెరి సత్యనారాయణ, పెరుమాళ్ల సత్యనారాయణ, సంఘు లింగం, నజీర్, చిట్యాల లక్ష్మీనారాయణ, ఆర్. భూమయ్య, ఎతిరాజ్యం నర్సయ్య, మరిపెల్లి జనార్దన్, తోట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సీపీఆర్ పై అవగాహన

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 19:

చిలుకూరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఆచార్లగూడెం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసిసిటేషన్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండె అకస్మాత్తుగా పనిచేయడం ఆగిపోయినప్పుడు బాధితుడికి తక్షణమే అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. సీపీఆర్ చేయవలసిన విధానం, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీపీఆర్ శిక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన నమూనా బొమ్మ సహాయంతో ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొని ప్రాణాలను కాపాడే ఈ ముఖ్యమైన నైపుణ్యంపై అవగాహన పొందారు. అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో స్పందించడం ద్వారా విలువైన ప్రాణాన్ని కాపాడవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, సకాలంలో స్పందన – ఒక నిండు ప్రాణానికి రక్షణ అని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు విజయదుర్గ, ఉపాధ్యాయులు హనుమంతరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞానానికి మూల కేంద్రాలు గ్రంథాలయాలు

మారుతున్న టెక్నాలజీలో గ్రంథాలను మర్చిపోయిన యువత

మోడ్రన్ గ్రంథాలయాలు నిర్మాణానికి కృషి చేస్తాం

జిల్లా గ్రంథాలయాల శాఖ చైర్మన్ గంగాపురం రాజేందర్

ప్రజా వాయిస్ తెలకపల్లి నవంబర్ 20

తెలకపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీ గ్రంథాలయ ఉద్యోగిని రాజ్యలక్ష్మి అందించిన చిత్రపటాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ గంగాపురం రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సభలో చైర్మన్ రాజేందర్ మాట్లాడుతూ గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ గారి సేవలను కొనియాడారు. గ్రంథాలయ శాస్త్రానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. పుస్తకాలు లేని సమాజం వెలుగు లేని ప్రపంచం లాంటిదని తెలిపారు. ప్రతి పాఠకుడికి పుస్తకం, ప్రతి పుస్తకానికి పాఠకుడు అనే ఆయన సూత్రాన్ని గుర్తు చేశారు. గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని,



పఠనాసక్తి పెరిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని సూచించారు. పిల్లల్లో చిన్న వయసు నుండే పుస్తకాలు చదివే అలవాటు పెంచాలని, మొబైల్ ఫోన్లకు బదులు పుస్తకాలకు సమయం కేటాయించాలని కోరారు.రాబోయే రోజుల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామని చైర్మన్ తెలిపారు. ప్రతి గ్రంథాలయంలో కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని, డిజిటల్ పుస్తకాలు, ఈ-బుక్స్ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గ్రామీణ విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతికత అందాలని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేక పుస్తకాలు అందిస్తామని, గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయంలో కొత్త పుస్తకాలు ఏర్పాటు చేయాలని పాఠకులు కోరగా, త్వరలోనే నూతన పుస్తకాలు అందజేస్తామని సానుకూలంగా స్పందించారు.చిత్రపటాన్ని అందించిన రాజ్యలక్ష్మిని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా గ్రంథాలయంపై ఆమెకున్న అభిమానం ఆదర్శమని అన్నారు. సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ పఠనం వల్లే వ్యక్తిత్వం పెరుగుతుందని, రంగనాథన్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. విద్యార్థులు రంగనాథన్ గారి జీవిత విశేషాలను, ఆయన రాసిన గ్రంథాల గురించి తెలుసుకున్నారు. చివరిగా గ్రంథాలయ సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంతో తెలకపల్లి గ్రంథాలయంలో నూతన ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ ఉద్యోగిని రాజ్యలక్ష్మి, తెలకపల్లి గ్రంథాలయ సిబ్బంది బోగరాజు పవన్ కుమార్ తెలకపల్లి సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్, ఉపసర్పంచ్ వారణాసి శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్ము ఆనంద్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, తెలకపల్లి కాంగ్రెస్ నాయకులు జీలని బాబా కొమ్ము. అనిల్ కుమార్ వాటర్ లక్ష్మణ్ ఇతర నాయకులు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు. పాల్గొన్నారు

ఇందిరాగాంధీకి నివాళులు...

పేదలకు పెన్షన్ల భరోసా

నర్ముడలో జయంతి వేడుకలు

వితంతు,దివ్యాంగులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

ప్రజావాయిస్॥శంషాబాద్:



భారత మాజీ ప్రధానమంత్రి దివంగత నేత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా శంషాబాద్ మండలం నర్ముడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల పత్రాలను అర్హులైన వితంతువులు, దివ్యాంగులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలు,బలహీన వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులకు పెన్షన్లు అందించడం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీరటి మహేష్,పంచాయతీ కార్యదర్శి రంజిత్,వార్డు సభ్యులు చౌట రాజు, కనకమామిడి విష్ణు, బూరుకుంట నాగరాజు, పర్వతం వినోద్, నాయకులు తొంట అశోక్, లింగం నవీన్,గూడెపు లక్ష్మణ్,అధికారులు,గ్రామ పెద్దలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలి

- **గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాల ఏర్పాటు**
- **ఈ నెల 20 నుంచి వివరాల నమోదు ప్రారంభం**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



ప్రజా వాయిస్ సంగారెడ్డి:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన కుటుంబాల వివరాలను నూతన విధివిధానాల ప్రకారం ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలు, నమోదు ప్రక్రియపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నమోదు శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ నుంచి శిబిరాల ద్వారా బీమా వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. శిబిరాల నిర్వహణ, నమోదు ప్రక్రియపై ప్రజలకు ముందస్తు సమాచారం అందేలా టామ్‌టామ్‌తో పాటు ఇతర సమాచార మాధ్యమాల ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. పథకం నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నందున అధికారులు, ఆపరేటర్లు పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు, నామినీల వివరాలు, వయస్సు, కుటుంబ సభ్యులతో ఉన్న బంధుత్వ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియ చేపట్టే ఆపరేటర్లకు ముందస్తు అవగాహన కల్పించాలని, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు శిబిరాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆహార భద్రత కార్డు కలిగిన అర్హుల వివరాలను మాత్రమే నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం బీమా చేయించుకున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు సమాచారం అందుతుందని కలెక్టర్ తెలిపారు. నామినీ వివరాలు నమోదు చేయాల్సి ఉన్నందున బీమా చేయించుకునే వ్యక్తి స్వయంగా నమోదు శిబిరానికి హాజరై అవసరమైన వివరాలను అందించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే నామినీలు శిబిరానికి హాజరుకావాల్సిన అవసరం లేదని తెలిపారు.నమోదు చేసిన ప్రతి దరఖాస్తు వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలకు అనుగుణంగా రికార్డులను నిర్వహించి భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, డీపీఓ మల్లారెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, సిపిఓ గీత, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈడీఎం ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.





పేదల జీవితాల్లో చేయూత వెలుగులు.!

రెండు గ్రామాల్లో 30 మందికి కొత్త పింఛన్లు

గాజుల మల్కాపురంలో 25 మందికి మంజూరు

జల్మాల్ కుంట తండాలో ఐదుగురికి లబ్ధి

పింఛన్ పత్రాలు అందజేసిన టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు

ప్రజావాయిస్,పెన్ పహాడ్:

పేదల జీవితాల్లో ప్రభుత్వం చేయూత వెలుగులు నింపుతోంది. అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా నూతన పింఛన్లు మంజూరు చేసింది. మండలంలోని గాజుల మల్కాపురం, జల్మాల్ కుంట తండాలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో మొత్తం 30 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.గాజుల మల్కాపురం గ్రామ సర్పంచ్ నాతాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరై 25 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు అందించారు. అనంతరం జల్మాల్ కుంట తండా సర్పంచ్ భూక్య జామా నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మరో ఐదుగురికి పింఛన్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.గాజుల మల్కాపురంలో సర్పంచ్ ఒగ్గ రవి, ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీరాములు, పిన్నేని కోటేశ్వరరావు, బండి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జల్మాల్ కుంట తండాలో పిన్నేని కోటేశ్వరరావు, పెన్ పహాడ్ సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి భరత్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గరీబి హఠావో లో భాగంగా సంక్షేమ పథకాలు

మాజీ ప్రధాని జయంతిలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

పేదరిక నిర్మూలన లక్ష్యంగా పరిపాలన

ప్రజా వాయిస్ నాగర్ కర్నూలు నవంబర్ 20

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి మాట్లాడుతూ 'గరీబీ హటావో'లో భాగంగానే నేటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు.ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.పేదరిక నిర్మూలన, దళిత-గిరిజన, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఇందిరాగాంధీ ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే తెలిపారు. 20 సూత్రాల సంక్షేమ ప్రణాళికతో పేదల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. బ్యాంకుల జాతీయం, రాజభరణాల రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశంలో కీలక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని అన్నారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల హృదయాల్లో ఇందిరాగాంధీ చిరస్థాయిగా నిలిచారని తెలిపారు.ఇందిరాగాంధీ అడుగుజాడల్లోనే రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పేదల



సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పథకం అర్హులకు చేరేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెల్ల రేషన్ కార్డుదారులకే ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా!

18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న కుటుంబ యజమానికే అవకాశం

ప్రజా వాయిస్ / మోమిన్ పేట్

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవన భీమా పథకం అమలుపై మండల, గ్రామపంచాయతీ స్థాయి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా పథకానికి తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు అర్హులని, కుటుంబ యజమాని వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని నిర్ధారించినట్లు తెలిపారు. ఒక కుటుంబంలో కుటుంబ యజమానికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన కుటుంబాలను గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వివరాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని దిశానిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజమల్లయ్య, డిప్యూటీ తహశీల్దార్ సురేష్ కుమార్, గిర్దావర్ శ్రీలత, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ వేధింపులకు తాళలేక ఉద్యోగానికి రాజీనామా

- ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి వచ్చిన హోంగార్డు
- మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిక
- పుల్కల్ గ్రామ సర్పంచ్ భర్త కృష్ణారెడ్డి

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

ప్రజాసేవతో ప్రజలకే అంకితం అవుతాం అనుకున్న వ్యక్తికి తిప్పలు తప్పలేదు పుల్కల్ గ్రామ సర్పంచ్ లావణ్య భర్త కృష్ణారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకుల వేధింపులు ఆగలేదు సర్పంచ్ వచ్చిన నాటి నుంచి కృష్ణారెడ్డికి అడుగడుగునా అవరోధాలు తప్పలేదు పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న. కృష్ణారెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయ పోరుకు సిద్ధపడ్డాడు గురువారం నాడు మాజీ మంత్రి హరీష్ రావు స్వగృహంలో ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నేతృత్వంలో తన అనుచర గణంతో బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దీనిపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందిస్తూ కృష్ణారెడ్డి సేవలు పార్టీ బలోపేతానికి అవసరమని ఆయన ఆహ్వానించారు ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వంలో నీచ రాజకీయాలు నడుస్తున్నాయని సామాన్య వ్యక్తులపై వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయి అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను ఏదో విధంగా భయపెడుతూ తమ అధికార దాహాన్ని తీర్చుకుంటున్నారని మండిపడ్డారు ఉద్యోగాన్ని తృణ ప్రాయంగా పక్కన పెట్టి ఆత్మ అభిమానంతో టిఆర్ఎస్ పార్టీలోకి కృష్ణారెడ్డి రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, నాయకుల పైశాచిక ఆనందపు వెకిలి చేష్టలను తరిమికొట్టేందుకు కృష్ణారెడ్డి లాంటి వారు ముందుకు రావడం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టడమేనాని అన్నారు.



గ్రంథాలయాలు సమాజానికి తలమానికలు

దాసరి ఉమామహేశ్వరి టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్/జె సి(జి) ప్రిన్సిపాల్

ప్రజా వాయిస్,మహబూబాబాద్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈరోజు గురువారం హై స్కూల్ స్థాయి విద్యార్థులకు ముగ్గుల పోటీ(రంగోళి) నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్/జె సి(జి) ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజానికి తలమానికాలు అని అన్నారు. ఒక పుస్తకం ఒక వ్యక్తి జీవితాన్ని మారిస్తే ఒక గ్రంథాలయం ఒక తరాన్ని ప్రభావితం చేస్తుంది, తలదించి పుస్తకాలను చదివితే తలెత్తుకుని జీవించేలా చేస్తాయన్నారు. గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను అధ్యయనం చేయడానికి దినచర్యగా చేసుకోవడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను చేరవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు జి. విజేందర్, రుద్రారపు వీరేందర్ , వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ్, సురాంబా, అనుజ, హిమబిందు, వినోద సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాటకులు పుస్తక ప్రియులు పాల్గొన్నారు

గోదావరి పుష్కరాల పనులను సమన్వయంతో వేగవంతం చేయాలి

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

బాసర ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

గోదావరి నది పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.గురువారం బాసర ఆలయ ఈఓ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరాల కోసం చేపట్టిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖాధిపతి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గోదావరి నదిలో ప్రస్తుత నీటిమట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఫొటోల రూపంలో పంపించాలని ఆదేశించారు. పనులకు సంబంధించి అవసరమైన అనుమతులు, ప్రభుత్వపరమైన నిర్ణయాలు పెండింగ్‌లో ఉంటే వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఆలయ నిర్మాణ పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పుష్కరాల సందర్భంగా వచ్చే ప్రముఖుల వసతి కోసం చేపడుతున్న భవన నిర్మాణ పనులపైనా పలు సూచనలు చేశారు.అనంతరం బాసరలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలకు అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. పరిసరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్ ఈఈ అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి

జూలూరుపాడు, ప్రజా వాయిస్:

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గురువారం ప్రారంభం అయ్యింది. మండల పరిధి పడమట నర్సాపురం, అనంతారం గ్రామాలలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు సంఘం లక్ష్మీ కుమారి, కొర్సా రమేష్ లు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అదేవిధంగా సాయిరాం తండా, బేతాళపాడు, పడమట నర్సాపురం, అనంతారం గ్రామాలలో సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం యొక్క ఉపయోగం గురించి కరపత్రాలు పంచుతూ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘం లక్ష్మీ కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి హార్దిక భరోసా కల్పించడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశం అని అన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనివార్య కారణాలవల్ల మరణించినప్పుడు ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడి 59 సంవత్సరాల లోపు వయస్సు గల ఫుడ్ సెక్యూరిటీ కార్డు గల లబ్ధిదారులందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టడం రాష్ట్ర పేద ప్రజలకు ఒక వరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రామాలయం చైర్మన్ లేళ్ల అప్పిరెడ్డి, సీనియర్ పార్టీ నాయకులు లేళ్ల రామిరెడ్డి, వార్డు సభ్యులు దామెర్ల రాములు, తెల్లబోయిన మల్లికార్జునరావు, పుప్పాల శ్రీనివాసరావు, సంఘం చిన్న రాజు, తెల్ల బోయిన రామయ్య, లేళ్ల నవీన్ రెడ్డి, రేషన్ డీలర్ లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.



బయ్యారంలో ఘనంగా ఇందిరమ్మ జయంతి వేడుకలు..

భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన నివాళులు..

ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి..

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,

ప్రజా వాయిస్, బయ్యారం..

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను బయ్యారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యారం మెయిన్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె దేశానికి అందించిన సేవలను, దేశ అభివృద్ధికి చేసిన కృషిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశ రాజకీయ చరిత్రలో ఇందిరాగాంధీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశ సమగ్రత, సమైక్యతను కాపాడటంతో పాటు పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. దేశాభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు, ప్రజా సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవలో ముందుకు సాగాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

ప్రజా వాయిస్/ఆత్మకూరు (ఎం):



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగానివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు దేశ ప్రధానిగా ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను,పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందడి అనంతరెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి,తిమ్మాపురం, రాయిపల్లి సర్పంచ్ లు కొసనలక్ష్మి,అంజయ్య,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,మండల నాయకులు,పి ఏ సి ఎస్ డైరెక్టర్లు,యూత్ కాంగ్రెస్,ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒరిస్సా వలస కార్మికుడు మృతి

మోటకొండూరు, నవంబర్ 19(ప్రజా వాయిస్):-.



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు,తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బేణుధర్ పుంజి (22), కాటేపల్లి శివారులోని ఇటుక బట్టీ వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటుకలు తయారు చేసే క్రమంలో గ్రిల్ ఉన్న ట్రాక్టర్‌తో ఎర్రమట్టిని తొక్కిస్తున్నాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ అదుపుతప్పి ఆ యువకుడిపైకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా; గాయపడిన బాధితుడు మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పొట్టకూటి కోసం వలస వచ్చి యువకుడు ఇలా మృత్యువాత పడటంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.





ఇంకుడు గుంతల పనుల ప్రారంభం ఎంపీడీవో

వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు

పాల్వంచ మండలం ఎంపీడీఓ పి. రాజారావు

ప్రజా వాయిస్ పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని మందరికలపాడు గ్రామపంచాయతీలో ఎంపీడీఓ పి. రాజారావు మరియు మండల పంచాయతీ అధికారి షేక్.షబ్నా గురువారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా అధికారులు ముందుగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి నిర్వహణ తీరును, చిన్నపిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం మరియు సేవలను నిశితంగా పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను సందర్శించి, గ్రామానికి జరుగుతున్న తాగునీటి సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.భూగర్భ జలాల పెంపొందించడమే లక్ష్యంగా గ్రామంలో భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో 26 ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించవచ్చని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై సమీక్షించి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా మొదటి విడత కి ఎంపికైన గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకం క్షేత్రస్థాయి అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లబ్ధిదారుల వివరాల నమోదు వేగవంతం చేయడం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు తగిన మార్గదర్శకాలు మరియు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మందరికలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భానులక్ష్మి,పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

రాజాపూర్ గ్రామానికి చెందిన కావేరి రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపిక

రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి గ్రామానికి, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకొస్తా:విద్యార్థిని కావేరి

ప్రజా వాయిస్.. వీపనగండ్ల



కోదేర్ మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్-14 బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ఆటతీరు కనబరిచిన జడ్పీహెచ్ఎస్ రాజాపూర్ 9వ తరగతి విద్యార్థిని ఎం. కావేరి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ నెల 22, 23, 24 తేదీలలో మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కావేరి పాల్గొననుంది. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి తన గ్రామానికి, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకువస్తానని కావేరి తెలిపింది.రాష్ట్ర స్థాయికి ఎంపికైన కావేరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం గర్వకారణమని, కావేరి రాష్ట్ర స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ, పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ చేసిన కృషి చిరస్మరణీయం

భారత మాజీ ప్రధాని ఇందిరమ్మ జయంతి సందర్భంగా చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల నివాళులు

కీసర డివిజన్‌లో ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగాలని నాయకుల పిలుపు

ప్రజావాయిస్, కీసర :

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కీసర డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను, ఆమె నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నాయకులు స్మరించుకున్నారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేద ప్రజల సంక్షేమం కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కర్రె బలమని, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తటాకం లక్ష్మణ్ శర్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...





నిర్మల్ రోడ్లకు మహర్దశ

కేంద్రమంత్రి నితీష్ గడ్కరీ కలిసి సి ఆర్ ఐ ఎఫ్ నిధులు

మంజూరు చేయాలని కోరిన బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాబట్టేందుకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సుకు విచ్చేసిన కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ భేటీ సందర్భంగా నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారుల విస్తరణ, గ్రామీణ రోడ్ల దుస్థితిపై కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి వివరంగా నివేదించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని,కొత్త రోడ్ల నిర్మాణం అత్యవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర రహదారి మరియు మౌలిక సదుపాయాల నిధి (జ=xఖీ)తో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టుల కింద నిర్మల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.రహదారి సౌకర్యాలు మెరుగుపడితేనే రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడానికి, వ్యాపారులు, విద్యార్థులు,సామాన్య ప్రజలు రాకపోకలు సాగించడానికి ఎంతో వెసులుబాటు కలుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. నిర్మల్ నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేసే విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి హామీతో త్వరలోనే నిర్మల్ నియోజకవర్గానికి నూతన రహదారి ప్రాజెక్టులు మంజూరయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



ఘనంగా కొమురం భీం భవన్ భూమి పూజ కార్యక్రమం

ప్రజా వాయిస్ కొత్తగూడ

గిరిజన ఆత్మగౌరవ ప్రతీక అయిన కొమురం భీం భవన్ నిర్మాణానికి కొత్తగూడ మండల కేంద్రంలో భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవ, సహకారంతో ఈ భవన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు (కోటి యాభై లక్షల రూపాయలు) మంజూరయ్యాయి.స్థానిక సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూపుసింగ్, మాజీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య హాజరై భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..మంత్రి సీతక్క గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఈ కొమురం భీం భవన్ గిరిజనుల సమావేశాలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి సీతక్కకు మండల ప్రజలు, గిరిజన సంఘాల నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

షాబాద్ మండలం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కోట జగదీశ్వర్

బోడంపహాడ్ గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి

(ప్రజా వాయిస్ షాబాద్)



షాబాద్ మండల పరిధిలోని బోడం పహాడ్ గ్రామంలో ఇందిరమ్మ జయంతి వేడుకలు ఘనంగా నివాళులు అర్పించారు.గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి నవీన్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ కమలమ్మ – చెన్నయ్య యూత్ వైస్ ప్రెసిడెంట్ కోట జగదీశ్వర్ హాజరై విగ్రహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇందిరా గాంధీ దేశం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన గొప్ప నాయకురాలని కొనియాడారు. పేదరిక నిర్మూలన కోసం గరీబీ హఠావో నినాదంతో పేద ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. బ్యాంకుల జాతీయకరణ, హరిత విప్లవం, బంగ్లాదేశ్ విముక్తి వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టారని తెలిపారు.ఇందిరా గాంధీ చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తుందని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. యువత ఆమె జీవితం నుండి స్ఫూర్తి పొంది, దేశ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, మాజీ సర్పంచ్ కోరే నర్సీములు, మాజీ సర్పంచ్ కోరే చిన్నయ్య, కళ్లెం బాలకిష్టయ్య, మంగలిలక్ష్మయ్య, కళ్లెం మల్లేష్, బండయ్య, రాజు, ప్రవీణ్, బర్కని బాలయ్య, బాల్చేంద్రయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీలో అక్రమాలు.. అర్హులకు అన్యాయం!

అనర్హులకు లంచాలు తీసుకొని పింఛన్లు మంజూరు చేస్తున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపణ

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆూూా) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అర్హులైన వృద్ధులు, వితంతువులకు పింఛన్లు అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ఆర్థికంగా స్థితిమంతులైన అనర్హులకు అక్రమ మార్గాల్లో పింఛన్లు మంజూరు చేస్తున్నారని విమర్శించారు.జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో నిజమైన లబ్ధిదారులు నెలల తరబడి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పింఛన్లు మంజూరు కావడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు, మధ్యవర్తులు వేల నుంచి లక్షల రూపాయల వరకు లంచాలు తీసుకుంటూ అనర్హులకు పింఛన్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.పింఛన్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించడమే ఈ అక్రమాలకు కారణమని, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్తగా మంజూరైన, పెండింగ్‌లో ఉన్న పింఛన్ల జాబితాలపై జిల్లా వ్యాప్తంగా సామాజిక తనిఖీ నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులు, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి వృద్ధుడికి, వితంతువుకు ఎలాంటి పైరవీలు, లంచాలు లేకుండా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమానికి కేటాయించిన నిధులు పక్కదారి పట్టడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ సహించబోదని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ స్పష్టం చేశారు.



నేటి తరానికి ఇందిరమ్మనే దిక్సూచి సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్

ప్రజా వాయిస్/కొడకండ్ల

నేటి తరం యువతి యువకులకు అన్నిరంగాల్లో రాణించడానికి భారత ఉక్కు మహిళ ఇందిరమ్మ నే దిక్సూచిగా తీసుకొని ముందుకు సాగాలని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యెన్నం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిర గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆశయాలు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సాకారం అవుతున్నాయని అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి టిపిసిసి ఉపాధ్యక్షులు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొడకండ్ల అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో రామవరం సర్పంచ్ గురగాని క్రాంతికుమార్ జిల్లా పార్టీ కార్యదర్శి ధర్మారావు బిక్షపతి మాజీ సర్పంచ్ మధుసూదన్ మాజీ పట్టణ అధ్యక్షులు మధురం రవీందర్ దేశగని నాగరాజు కనకయ్య తండా రమేష్ అందే అరుణ్ కుమార్ రాము మార్గం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

కుటుంబానికి పోలీస్ శాఖ పక్షాన రూ.30 వేల తక్షణ ఆర్థికసహాయం

ప్రజా వాయిస్ గూడూరు



పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జి శ్రీనివాస్ రెడ్డి గురువారం తెల్లవారుజామున సుమారు 05:30 గంటల సమయంలో గుండెపోటుతో మహబూబాబాద్ ఆసుపత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ టౌన్ డీఎస్పీ తిరుపతిరావు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాలమేరకు గూడూరు సీఐ వినయ్, ఎస్ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది మృతుడి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ..సందర్భంగా పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి తక్షణ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.30,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో పోలీస్ శాఖ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ..కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ వినయ్, ఎస్ఐ రమేష్ బాబు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాం చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ బాదె రామన్న, ఈసీ సభ్యులు ఈసం సురేష్ తదితరులు పాల్గొన్నారు.